


ఊరూరా.. బెట్టింగ్ బంగార్రాజులే

- ఫలితాలపై పందాల జోరు
- టీడీపీ గెలుపుపై 1కి 3 లేదా 5 రెట్లు
- వైసీపీపై పందెం కట్టేవాళ్లు కరువు
- పోలింగ్ ముందుకాసిన బెట్ సెటిల్



గోపాలపురంలో బెట్టింగులో డబ్బులు కలుపుతున్న యువకుడు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ఫలితాలపై జిల్లాలో పందాలు జోరందుకున్నాయి. ఎవరి అంచనాల మేరకు వాళ్లు కట్టల కొద్దీ డబ్బును బెట్టింగ్‌లో పెడుతున్నారు. గతంకంటే ఈ ఎన్నికల్లో పందాల జోరు హుషారుగా సాగుతోంది. విదేశాల్లో ఉన్నవాళ్లు సైతం ఏపీ ఎన్నికల ఫలితాలపై దృష్టి పెట్టారు. లక్షలాది రూపాయలను తమ వారికి పంపించి పందెం కాయిస్తున్నారు. తతంగం అంతా ఫోన్లలో జరిగిపోతుండగా.. జామీనుగా కాగితాలను రాసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లోనూ బెట్టింగులు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాష్ట్రం మొత్తంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే పందాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెబుతున్నారు. వాస్తవానికి సంక్రాంతి సమయంలో కోడి పందాలకు ఈ జిల్లా పెట్టింది పేరుకావడంతో అదే అలవాటుగా ఎన్నికల బరుల్లో నిలిచిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యాలపై డబ్బుపెడుతున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులపై, పార్టీ గెలుపు, మెజారిటీలపై పందాలు కాస్తున్నారు.

● పిఠాపురంపైనే చూపు

జనసేనానికి పవన్‌కల్యాణ్ బరిలో ఉన్న పిఠాపురంపై బెట్టింగులు భారీసంఖ్యలో జరుగుతున్నాయి. ఎన్ఆర్ఐలు కూడా పందాలు కాస్తున్నారు. సాధారణంగా గెలుపుఓటములపై పందాలు కాస్తారు. కానీ పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్ మెజారిటీపై ఎక్కువగా బెట్టింగ్ కడుతుండడం విశేషం. కచ్చితంగా పవన్ 30వేలపైనే ఆధిక్యం సాధిస్తారని డబ్బులు పెడుతున్నారు. ఈ నియోజకవర్గంలో పోలింగ్ శాతం కూడా గణనీయంగా పెరగడంతో ఆ మేరకు అంచనాలు పెరిగిపోయాయి. పవన్‌కల్యాణ్ గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తూ తెలంగాణ నుంచి కూడా ఇక్కడి వారితో పెద్దఎత్తున బెట్టింగ్‌లు కడుతున్నారు. తర్వాత రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గంపై పందాలు జోరుగా సాగుతున్నాయి. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కూడా కూటమి గెలుపుపై పెద్దఎత్తున బెట్టింగ్‌లకు చాలామంది సవాళ్లు విసురుతున్నారు.

● కూటమిపై కోసు పందెం

కూటమిపై కోసు పందాలు వేస్తున్నారు. రాష్ట్రంలో కచ్చితంగా కూటమి అధికారంలోకి వస్తుందంటూ లక్షలాది రూపాయలు పందెంలో పెడుతున్నారు. కూటమి గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తూ కోసు పందెం కాస్తున్నారు. అంటే 1కి 3 రెట్లు లేదా అయిదురెట్లు ఎక్కువగా ఇస్తామంటూ పందెంలోకి దిగుతున్నారు. కొన్నిచోట్ల డబ్బుతో పాటు వాహనాలు, స్థలాలను కూడా బెట్టింగ్‌లో పెడుతున్నట్టు సమాచారం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగువాళ్లు జిల్లాలోని వారి బంధువులకు ఫోన్‌చేసి కూటమి గెలుపుపై పందాలు కాస్తున్నారు. సాధారణంగా యువత, సులభంగా డబ్బు సంపాదించాలనుకునే వాళ్లు పందాలపై ఎక్కువగా దృష్టి పెడుతుంటారు. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం ఉద్యోగులు, వ్యాపారస్తులు సైతం పెద్ద మొత్తంలో బెట్టింగ్ కడుతున్నారు. ఎన్నికల పోలింగ్ భారీగా జరగడంతో అంచనాలు కూడా అదే స్థాయిలో చేస్తూ ఈ పందాల జోరు కూడా అదే స్థాయిలో పెరిగింది.

● పోలింగ్ తర్వాత మారిన సీన్

ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించిన నాటి నుంచీ బెట్టింగులు మొదలయ్యాయి. అభ్యర్థి, అక్కడి వాతావరణం ఆధారంగా పందాల్లోకి దిగారు. తొలుత కూటమి, వైసీపీల గెలుపులపై పోటాపోటీగా డబ్బులు పెట్టారు. కానీ పోలింగ్ తర్వాత సీన్ మారిపోయింది. టీడీపీ గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తూ పందానికి డబ్బులు పట్టుకుని తిరుగుతున్నా వైసీపీ తరపున కాసేవారు కరువయ్యారు. పోలింగ్ అయిన తర్వాత అప్పటివరకూ వైసీపీ తరపున పందాలు కట్టినవాళ్లు కొంత మొత్తాన్ని వదులుకొని సెటిల్ చేసుకుంటున్నారు. రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలో ఇద్దరు వ్యక్తుల నడుమ బుధవారం రూ.10 లక్షల పందానికి రాతలు జరిగాయి. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో టీడీపీ గెలిచి తీరుతుందంటూ ఓ వ్యక్తి రూ.5 లక్షలకు పందెం కట్టాడు. ఇలా లక్షల రూపాయలను బెట్టింగ్‌ల్లో పెడుతున్నారు. అయితే అధిక శాతం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపు ఖాయమంటూ పందాలకు సవాల్ విసురుతున్నారు. పందాలు కాస్తున్న వారిలో మధ్యతరగతి వారి నుంచి ధనవంతులు కూడా ఉంటున్నారు. ఏదో సరదాకి కాకుండా చాలా సీరియస్‌గా పందాల తంతు సాగుతోంది. జూదం కిందకు వచ్చే పందాలు చట్టరీత్యా నేరం. అయితే ఎవరికి వారు గుట్టుగా పందాలు పట్టుకోవడంతో వ్యక్తుల పేర్లు బయటకు పొక్కడం లేదు. ఫోన్లు, ఆన్‌లైన్‌ల ద్వారా కూడా బెట్టింగ్ దందాలు కొనసాగుతున్నాయి. దీంతో పోలీసులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో భారీ సంఖ్యలో బెట్టింగ్‌లు జరుగుతున్నా ఒక్క ఫిర్యాదు కూడా పోలీసులకు అందకపోవడం గమనార్హం. కనీసం దీనిపై నిఘా పెట్టినట్టు కూడా కనిపించడం లేదు.

● కౌంటింగ్ ఎంతోదూరం.. ఎంతమంది చిక్కుకుంటారో..

గోపాలపురం, మే 15: పోలింగ్ ముగియడంతో ఫలితాలపై పందాలు జోరందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తెల్లారిలేచింది మొదలు ఎక్కడ చూసినా పందాల చర్చలే. రాష్ట్రంలో టీడీపీ గెలుస్తుందని, వైసీపీ గెలుస్తుందని పందాలు నడుస్తున్నాయి. కౌంటింగ్ వ్యవధి ఎక్కువగా ఉండడంతో పందాలకు ఎందరు చిక్కుకుంటారోనని పలువురు ఆవేదన చెందుతున్నారు.

కూటమిలో జోష్

విజయం కూటమివైపు అంటూ ప్రచారం

ఉద్యోగవర్గాల్లోనూ ఇదే చర్చ

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు నుంచి జోష్‌లో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో ఎన్నికల తర్వాత మరింత జోష్ పెరిగింది. వారితోపాటు ప్రజల్లోనూ ఆసక్తికర చర్చ జరుగుతోంది. సైలెంట్ వేవ్ ఉందని, అందుకే పోలింగ్‌కు కసితో జనం వచ్చినట్టు వేశారనే అంచనాకు ఇంచుమించు అన్ని వర్గాలు వచ్చాయి. ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతతోనూ ఈ వేవ్ వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. టీడీపీ కూడమిలో అందరూ గెలుపు ధీమాతో ఉన్నారు. మెజార్టీలు అంచనా వేసుకుంటున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపు అవకాశాలకు కూటమి బలం, ప్రభుత్వంపై వ్యతిరేక ఓట్లు చీలకపోవడం, అభ్యర్థులతో పాటు కూటమి నేతలు, శ్రేణులు కలసి పనిచేయడం వల్ల మంచి ఫలితాలు రానున్నట్టు అంచనా వేస్తున్నారు. అటు వైసీపీ అభ్యర్థులు రకరకాల వ్యూహాలతో ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించిన నేతలు కూడా డీలాపడ్డారు. సీఎం జగన్ వైఖరిని లక్ష్యంగా చేసుకుని ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేయడానికి రావడంతో వైసీపీలో ఓట్ల కోసం కష్టపడ్డ వారి ప్రయత్నాలన్నీ వృథా అయినట్టు ప్రచారం జరుగుతోంది. అయినా ఎవరి ధీమాతో వారు ఉన్నారు. ఇక ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్గాలు, అధికారుల్లో కూటమి వచ్చేస్తుందనే చర్చ జరుగుతోంది. కానీ అవినీతికి ఆస్కారం ఉన్న, అధికార పార్టీ తప్పులకు తలొగ్గిన అధికారుల్లో భయం మొదలైంది. కూటమి అధికారంలోకి వస్తే, అవినీతిపై విచారణలు ఉంటాయని, తప్పు చేయక పోయినా, మౌనంగా ఉండడం, అడ్డుకోకపోవడం వంటి కారణాలతో ఇరుక్కోవలసి వస్తుందనే భయం పట్టుకుంది. మొత్తం మీద ప్రభుత్వ విధానాలు నచ్చక ప్రతిపక్ష పార్టీలకంటే ముందు ఉద్యోగులే నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా విజయవాడ వీధుల్లోకి వచ్చి కదంతొక్కిన సంగతి తెలిసిందే. తర్వాత అందరిలోనూ ధైర్యం వచ్చింది. తెలుగుదేశం చంద్రబాబు పోరాటం, లోకేశ్ పాదయాత్ర, పవన్ వారాహి యాత్ర వంటివి ప్రజల్లో ఒక నమ్మకాన్ని కలిగించినట్టు పరిశీలకులు భావిస్తున్నారు. తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడం, రాజమహేంద్రవరంతోపాటు పలుచోట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రచారం చేయడం కూడా కూటమికి కలసి వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి జోష్ మీద ఉంది.

వీళ్లింతేనా?

- సిటీలో ఓటు వేయని ఆ 33 శాతం మంది ఏమయ్యారు
- ఎప్పటి మాదిరిగానే ఆఖరున ఓటుకు వచ్చి వెనుదిరిగిన జనం
- మరోవైపు మందకొడిగా ఈవీఎంల పనితీరు
- క్యూలో నిలుచోలేక కొందరు, సొంత పనుల కోసం మరికొందరు ఓటుకు దూరం

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న గొప్పతనం అమూల్యమైనది. పాలకులను ఎన్నుకొనే మహత్తర సమయం. ఐదేళ్లకు ఒకసారి వచ్చే అద్భుత అవకాశం. కానీ కొందరు ఓటర్లకు ఓటు విలువ ఈనాటికీ తెలియడం లేదు. వేలుపై ఇంకు పడడం పల్లె జనం ఒక హోదాగా భావిస్తుంటే నాగరికతకు నిదర్శనాలం, ఆధునికతకు దర్పణాలం అని చెప్పుకొనే సిటీ ఓటర్లు మాత్రం వెనుకబడిపోతున్నారు. వాస్తవానికి పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించినా బద్ధకం పోవడం లేదు. గ్రామాల్లో మాత్రం ఒక రోజు కూలీ పోయినా ప్రజాస్వామ్యాన్ని బతికించాలనే తపన కనబడింది. రవాణా తదితర ఇబ్బందులను అధిగమించి మరీ పోలింగ్ బూత్‌లకు వచ్చారు. పట్టణాలు, నగరాల్లో మాత్రం ఓటు వేయడానికి కాసేపు క్యూలో నిలబడలేక, కొంత సమయమైనా కేటాయించలేని దుస్థితి మనది.



రాజమహేంద్రవరంలో సోమవారం క్యూలైన్లలో తక్కువగా కనిపించిన ఓటర్లు (ఫైల్ ఫొటో)

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి.. శాతాల్లో..

నియోజకవర్గం	2014	2019	2024
రాజమండ్రి సిటీ	69.47	66.19	66.72
రాజ. రూరల్	73.97	74.21	72.99
కొవ్వూరు	85.28	86.46	85.69
నిడదవోలు	85.72	82.70	80.31
గోపాలపురం	86.96	85.92	85.10
అనపర్తి	85.98	87.44	83.78
రాజానగరం	85.93	87.83	86.16
జిల్లా మొత్తం	81.90	81.53	80.93

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పోలింగ్ సరళిని గమనిస్తే ఈసారి గ్రామాలు ఉన్న నియోజకవర్గాల్లో ఓటర్లు హుషారెత్తించారు. నగరాల్లో జనం మాత్రం సొంత పనులకు పరిమితమయ్యారు. ప్రజాస్వామ్యాన్ని బతికించుకొనేరోజు ఐదేళ్లకు ఒకసారి మాత్రమే ఓటరు చేతివరకూ వస్తుంది. ఆ రోజు దాటిందంటే సువర్ణావకాశం చేజేతులా జారవిడుచుకున్నట్టే. ఆ విషయాన్ని కూడా సిటీ ప్రజలు ఇంకా ఆకళింపు చేసుకున్నట్టు కనబడడం లేదు. సోమవారం జరిగిన పోలింగ్‌లో సిటీ జనం చాలా మటుకు ఓపిగ్గా క్యూలో నిలబడి ఓటువేసినా.. వేలాది మంది ఇళ్లకే పరిమితమయ్యారు. ఒకవేళ పోలింగ్ స్టేషను వరకూ వచ్చినా లైనులో నిలబడలేక వెనుదిరిగారు. కొందరు ఇళ్ల వద్ద నుంచే పోలింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితి తెలుసుకొని ఆగిపోయారు. పండు టాకులు, మంచం పట్టిన వారు సైతం ఉద్యమంలా వచ్చి ఓటు వేసినా అన్ని అవయవాలు సవ్యంగా పని చేస్తున్న వేలాది మందిలో మాత్రం ఆ బాధ్యత కరువైంది. కొన్ని దేశాల్లో ఓటు వేయకపోతే జరిమానా విధించడం అమల్లో ఉంది. భారత్‌లో కూడా ఆ విధానం వస్తేగానీ కనువిప్పు కలగదనే వాదన పలువురి నుంచి వినవస్తోంది.

● సిటీ నియోజకవర్గంలో చివరాఖరున వచ్చి..

రాజమండ్రి లోక్‌సభా స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురంలలో 2014లో 81.90 శాతం, 2019లో 81.53 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. ఈసారి 80.93 శాతం మాత్రమే నమోదైంది. ఓటువేయని సుమారు 20 శాతం మంది ఇళ్లకు, సొంత పనులకు పరిమితమయ్యారు. ఇక జిల్లాలోని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో అత్యల్పంగా 66.72 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. అంటే సుమారు 33 శాతం మంది ఓటర్లు పోలింగ్ స్టేషన్లకు రాలేదు. 3 శాతం మంది ఆస్పత్రుల్లో ఇతర అత్యవసర పనుల వల్ల రాలేకపోయినా ఏకంగా 30 శాతం మంది ఓటింగ్‌కి దూరంగా ఉండడం గర్హనీయమని ప్రజాస్వామ్యవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు దఫాల ఎన్నికల్లో కూడా ఏడు నియోజకవర్గాలకు సంబంధించి రాజమహేంద్రవరం సిటీలో అత్యంత తక్కువగా ఓటింగ్ నమోదైంది. దీంతో నగర ఓటర్లలో ఏ స్థాయిలో నిరాసక్తత ఉందో తెలుస్తోంది.

● మందకొడిగా ఈవీఎంల పనితీరు

ఓటర్లు ఉద్యమంలా తరలివచ్చినా ఈవీఎంలు మొరాయించడం, మందకొడిగా పోలింగ్ సాగడం, కనీసం కూర్చోవడానికి కూడా సరిపడా కుర్చీలు లేకపోవడం ఓటర్లకు చిర్రెత్తించింది. ఓవైపు ఎండ, మరోవైపు సదుపాయాల కొరతతో అల్లాడిపోయారు. ఓ దశలో భారీ క్యూలైన్లు ఎటు నుంచి ఎటు వెళ్లాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. హెల్ప్ డెస్క్ కూడా చేతులెత్తేయక తప్పలేదు. చాలాచోట్ల అప్పటికప్పుడు టెంట్లను రప్పించి సరిపెట్టారు. పోలింగ్ స్టేషనులోకి వచ్చిన ఓటరుకు బూత్ నంబరు చెప్పడానికి కూడా తగు సిబ్బంది లేరు. దీంతో వృద్ధులు, పసివాళ్లతో వచ్చిన మహిళలు తీవ్రంగా అసహనం వ్యక్తంచేశారు. మహిళలకు చాలాచోట్ల ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటుచేయలేదు. ఇక దివ్యాంగుల పరిస్థితి మరీ దారుణంగా కనిపించింది. వారిని వీల్‌ఛైర్‌లో బూత్ లోపలికి తీసుకెళ్లే సహాయకులూ తగు సంఖ్యలో లేరు. మధ్యాహ్నం నుంచి ఉన్న కొద్దిపాటిమంది కూడా కనుమరుగయ్యారు. దీంతో ఆటో డ్రైవర్లు, తమ కూడా వచ్చిన వారి సహాయంతో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల పాట్లు మరీ ఎక్కువగా కనిపించాయి. మెడికల్ డెస్కులు పెట్టినా జనాలకు ఉపయోగపడలేదు. వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసే ప్రయత్నం కూడా చేయలేదు. కొన్నిచోట్ల ఈవీఎంల మొరాయింపుతో సమయం వృథా అయ్యింది. ఒక్కో ఓటు తీసుకోవడానికి ఈవీఎంకి సగటున 3 నుంచి 5 నిమిషాల సమయం పట్టడంతో జనం ఎక్కువసేపు క్యూలైన్లలో మగ్గిపోక తప్పలేదు. ఈ ప్రభావం కూడా ఓటింగ్ శాతంపై పడింది. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటింగ్ శాతం పడిపోయింది. జిల్లాలో 3,09,594 మంది ఓటర్లు పోలింగ్‌కి దూరంగా ఉండగా.. గత ఏడాది కంటే 0.60శాతం దిగువకు పడిపోయి 80.93 శాతం నమోదైంది. రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో అత్యధికంగా 86,751 మంది ఓటేయలేదు. నగర ఓటర్లు సహజంగానే విద్యావంతులు అధికంగా ఉంటారు. ఓటుపై స్పృహ ఉన్నప్పటికీ ఓటేయకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

కాటన్‌దొర సేవలు ఎనలేనివి



ధవళేశ్వరంలో కాటన్‌కు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పురందేశ్వరి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ధవళేశ్వరం, మే 15: ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేయడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో సాగునీటి కట్టడాలు నిర్మించి ప్రజలకు సాగు, తాగు నీరు అందించిన కాటన్‌దొర సేవలు ఎనలేనివని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. బుధవారం ఉదయం బ్యారేజ్ సెంటర్ వద్ద ఉన్న కాటన్ దొర విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 144 సెక్షన్ అమలు : కలెక్టర్



జిల్లా కలెక్టర్ మాధవీలత

దివాన్‌చెరువు,మే15: భారత ఎన్నికల సంఘం జారీచేసిన నోటిఫికేషన్ మేరకు పోలింగ్ ప్రక్రియ తర్వాత ఈవీఎంలు, వీవీప్యాట్‌లను వెలుగుబందలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని, 24 గంటలూ భద్రతా బలగాలు కాపలా కాస్తున్నాయని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపు పూర్తయ్యేవరకూ 144 సెక్షన్ అమల్లోకి తెచ్చామని, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు తప్ప ఒక కి.మీలోపు ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు చట్టవిరుద్ధంగా సమావేశమవ్వడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకూ స్ట్రాంగ్‌రూమ్‌ల పరిధిలో ఒక కిలో మీటరు మేర ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ ఉత్తర్వుల ఉల్లంఘన జరిగితే భారతీయ శిక్షాస్మృతి 1860లోని సెక్షన్ 188 ప్రకారం కఠినంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వచ్చాయని కలెక్టర్ తెలియజేశారు.

ఓట్ల లెక్కింపు ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండాలి : ఐజీ

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ముగిసే వరకూ మరింత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా ఏర్పాటుచేసి బందోబస్తుపై ఆయన సమీక్ష చేశారు. జిల్లాలో కొనసాగుతున్న భద్రతా చర్యల గురించి ఐజీకి ఎస్పీ జగదీశ్ వివరించారు. జగన్నాథపురం, గోపాలపురం చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. హింసాత్మక సంఘటనలకు పాల్పడినా, కవ్వింపు చర్యలకు దిగినా, సాధారణ జన జీవనానికి విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఐజీ హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసులను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని బందోబస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్షించి పలు సూచనలు చేశారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు సమీక్షిస్తున్న ఎస్పీ జగదీశ్

జిల్లాలో 144 సెక్షన్ అమలు : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకూ జిల్లాలో సెక్షన్ 144 అమలులో ఉంటుందని ఎస్పీ జగదీశ్ స్పష్టం చేశారు. నలుగురు అంతకుమించి గుంపులుగా ఉండకూడదన్నారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ప్రచారాలు నిర్వహించడం నేరమన్నారు. అన్ని ప్రాంతాలపై ప్రతిక్షణం నిఘా ఉందని.. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ బుధవారం పరిశీలించారు. కెమెరాల పనితీరు, బందోబస్తు, రూమ్ చుట్టూ కంచె తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధులు నిర్వర్తిస్తున్న కేంద్ర, రాష్ట్ర బలగాలకు పలు సూచనలు చేశారు. నిరంతరం అప్రమత్తతో ఉండాలని ఆదేశించారు.

- నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్
- వైసీపీ అహంకారం అంతం : నాగబాబు
- గోదావరిలో స్నానానికి దిగి విద్యార్థి మృతి - 7లో

నేటి నుంచి ఏపీఈఏపీసెట్

- మొత్తం 3,61,640 దరఖాస్తులు
- 16 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం
- సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి


కన్వీనర్ వెంకటరెడ్డి

జేఎన్టీయూకే, మే 15: ఏపీలో 47, తెలంగాణలోని 2, మొత్తం 49 ప్రాంతీయ కేంద్రాల్లో కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 23 వరకూ నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్‌కు మొత్తం 3,61,640మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సెట్ కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఇంజనీరింగ్‌కు 2,73,010 మంది, అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షకు 87,419 రెండింటికీ 1211 మంది దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈనెల 7న విడుదల చేశామని విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్‌టిక్కెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్‌ను ఎంటర్ చేసి హాల్ టికెట్లను పొందవచ్చన్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలు 16నుంచి 17వరకూ, ఇంజనీరింగ్ పరీక్షలు 18 నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నామని హాల్‌టికెట్లను https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ కె.వెంకటరెడ్డి సూచించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య, విద్యుత్, పోలీస్ అధికారులకు, అన్ని జిల్లాల అధికారులకు పలు సూచనలు చేశామన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884-2342499, 2359599 నెంబర్లలో కానీ helpdeskapeapcet@apsche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించాలని సూచించారు. ఈ పరీక్షలకు కాకినాడ జిల్లాలో 11,509 మంది విద్యార్థులు హాజరుకానున్నారని కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్, ప్రగతి ఇంజనీరింగ్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రాల్లో నిర్వహించనున్నామన్నారు. మొత్తం 8రోజులపాటు ఆన్‌లైన్‌లో జరిగే అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలకు 3620మంది విద్యార్థులు, ఇంజనీరింగ్ పరీక్షలకు 7865 మంది, రెండింటికీ 24మంది విద్యార్థులు హాజరుకానున్నారని కన్వీనర్ తెలిపారు. అమలాపురం పరిధిలోని భట్లపాలెంలో ఉన్న బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, రాజమహేంద్రవరం పరిధిలోని లూథర్‌గిరిలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లోనూ పరీక్షలను నిర్వహించనున్నామన్నారు.

స్నానానికి దిగి విద్యార్థి మృతి


విద్యార్థి బాలాజీ

కొవ్వూరు, మే 15 : గోదావరి నదిలో స్నానానికి వచ్చి ప్రమాదవశాత్తు నదీలో మునిగి విదార్థి మృతి చెందినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. సుధాకర్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన చుక్క బాలాజీ(24) ఏఎస్ఆర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం తన స్నేహితులు సమెల్లి సంతోష్‌కుమార్, దత్తు రోహిత్ రామసూర్యలతో కలిసి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం సీతంపేట గ్రామంలోని విజ్జేశ్వరం బ్యారేజ్ 36వ గేట్ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగారు. నది లోతును గమనించకుండా గోదావరిలో దిగడంతో ప్రమాదవశాత్తూ కాలుజారి నదిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

ఆత్రేయపురం, మే 15: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో స్నానం చేస్తూ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మోదుగుంటకు చెందిన ఆరేపల్లి శ్రీరామ్ (22) బుధవారం సాయంత్రం మిత్ర బృందంతో కలిసి గోదావరి బ్యారేజీని సందర్శించారు. ఆటపాటలతో సందడి చేస్తూ ఉల్లాసంగా గడిపారు. సాయంత్రం వేళ ర్యాలి ఆర్మ్ అడ్డుకట్ట వద్ద స్నానం ఆచరిస్తుండగా ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. స్థానికులు గాలించి అతడిని బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న శ్రీరామ్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి




రాజారావు

రావులపాలెం, మే 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఈతకోటలోని ఓ ప్రైవేటు కంపెనీలో కొత్తపేట మండలం వాడపాలేనికి చెందిన అజ్జరపు రాజారావు (60) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం విధులు ముగించుకుని సైకిల్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి చెంతనే ఉన్న ఓ హోటల్ సమీపంలో సైకిల్‌పై ఆగి ఉండగా తాడేపల్లిగూడెం నుంచి రంగంపేట వెళ్తున్న పాల ట్యాంకరు వేగంగా వచ్చి బలంగా ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయమై రాజారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసి మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

స్వాధార్ హోమ్ తనిఖీ


వివరాలు సేకరిస్తున్న జడ్జి ప్రకాష్‌బాబు

రావులపాలెం, మే 15: రావులపాలెంలోని స్వాధార్ హోమ్ (శక్తి సదన్)ను రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కె.ప్రకాష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పడక గదులు, వంట గది, డైనింగ్ హాల్ పరిశీలించారు. అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. హోమ్‌లో ఉన్న వారు, నిర్వాహకుల సమక్షంలో రికార్డులను పరిశీలించారు. యాజమాన్యం ఎలా చూస్తోంది, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా సౌకర్యాల కల్పనలో చెప్పాల్సింది ఏదైనా ఉందా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోమ్ నిర్వాహకులతో మాట్లాడుతూ హోమ్‌లో ఉన్న వారికి ఏ రకమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఈ ఏడాది ఆవకాయ ఘాటే





- తగ్గిన పచ్చడి కాయ దిగుబడి
- ఘాటెక్కిన కారం..
- మరుగుతున్న నూనెల ధరలు
- వంద కాయల పచ్చడికి రూ.10 వేలు ఉండాల్సిందే

పెద్దాపురం, మే 15 : పచ్చళ్ల సీజన్‌కు ఎన్నికలు అడ్డుపడ్డాయి. పోలింగ్ ముగియడంతో ఆవకాయ పచ్చడిపై మహిళలు దృష్టి సారించారు. వేసవిలో ఆవకాయ, మాగాయి, వంటి పచ్చళ్లు పెట్టుకోవడం సర్వసాధారణం. కూరలేకపోయినా పర్వాలేదు ఆవకాయ పచ్చడి ఉంటే చాలు అన్నంతో కడుపు నింపేసుకుంటారు. కొంతమందికి ఆవకాయ రుచి తగలనిదే ముద్ద దిగదు. సాధారణంగా మే నెల వచ్చిందంటే చాలు ప్రతీ ఇంట్లో పచ్చడి తయారీ సందడి కనిపిస్తుంది. పది రోజుల ముందు నుంచే తయారీకి అవసరమైన సరుకులు సిద్ధం చేసుకుంటారు. ఇది ఆవకాయ పచ్చడికి ఉన్న డిమాండ్. అయితే ఈఏడాది ఆవకాయ పచ్చడి ఘాటెక్కింది. పచ్చడి పెట్టాలంటే ప్రస్తుత ధర ప్రకారం చేతిలో సుమారు రూ. 10 వేలు ఉండాల్సిందే. అదే 50 కాయలతో అయితే సుమారు రూ. ఐదు వేలు చేతిలో ఉండాల్సిందే. దీనికి కారణం పచ్చడి కాయ దిగుబడి తగ్గిపోవడం, తయారీకి అవసరమైన సరుకుల ధరలు కొండక్కెడమే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పచ్చడి మామిడి కాయ ఎక్కువగా దివాన్‌చెరువు, రాజానగరం, గోకవరం, తుని, ఏజెన్సీ మండలాలనుంచి, అలాగే కొన్ని మెట్ట ప్రాంతాల నుంచి మామిడికాయ వచ్చేది. వాతావరణం అనుకూలించక పోవడంతో ఈ ఏడాది చాలాచోట్ల పూతదశలోనే రాలిపోయింది. అక్కడక్కడ అరకొరగా కాయలు కనిపిస్తున్నాయి. సాధారణంగా పచ్చడికాయ ధర కాయ సైజును బట్టి ఉంటుంది. సాధారణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్తపల్లి కొబ్బరి, దేశవాళీ హైజర్లు, చిన్న, పెద్ద రసాలు, ఆవకాయ పచ్చడికి వాడుతుంటారు.. ఎక్కువకాలం ముక్క మెత్తబడకుండా ఉండేందుకు కాయ కొనుగోలు చేసేటప్పుడు రాజీపడరు. గతంలో ఈరకం కాయలు కొత్తపల్లికొబ్బరి 100 కాయలు రూ.3500 ధర పలుకుతున్నాయి. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో కాయ రూ. 30 నుంచి రూ. 35 వరకూ సైజును బట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక పచ్చడి కారం ప్రధానం. గతంలో ఎన్నడూలేని విధంగా మిరప ధరలు ఘాటెక్కాయి. అలాగే కాయ ముక్కలు చేయడానికి రూ.3, గానుగ నూనె (నువ్వుల నూనె) లీటరు రూ.600, వేరుశెనగ నూనె రూ. 180, పచ్చడి కారం కిలో రూ. 800 క్వాలిటీని బట్టి పలుకుతోంది. ఇవన్నీ కాకుండా బ్రాండెడ్ కారం కేజీ ప్రస్తుతం రూ. 850 పైనే ఉంటోంది. వంద కాయలు పచ్చడి పెట్టాలంటే రూ. 10 వేలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. పెరిగిన నూనె ధరలను చూసి సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆవకాయ పెట్టగలమా అనే ఆందోళనలోకి వచ్చారు.

సామగ్రి ధరలు పెరిగాయి



పచ్చడికి అవసరమైన సామగ్రి ధరలు ఇప్పటికే పెరిగిపోయాయి. అలాగే కాయ ధర కూడా పెరిగింది. కనీసం 50 కాయలతో పచ్చడి పెట్టాలంటే రూ. 4 వేల నుంచి ఐదు వేలు పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఏడాది అంతా పచ్చడి నిల్వ ఉండాలంటే సరుకుల కొనుగోలులో రాజీ పడకూడదు. కాయ దగ్గర నుంచి అన్నీ నాణ్యమైనవే కొనాలి. ఎం.జ్యోతీసీతారత్నం, గృహిణి

రోడ్డు ప్రమాదం అత్యంత దురదృష్టకరం

క్షతగాత్రులను పరామర్శించిన హరీష్‌మాథుర్


క్షతగాత్రులను పరామర్శిస్తున్న హరీష్‌మాథుర్

కొత్తపేట, మే 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత దురదృష్టకరమని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాథుర్ అన్నారు. బుధవారం ఆయన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ప్రమాద వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నామన ఫౌండేషన్ ద్వారా బాధిత కుటుంబాలకు తక్షణం సాయం కింద రూ.20 వేలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నామన రాంబాబు, తోలేటి సత్తిబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మీభాస్కరరావు, గుబ్బల మూర్తి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నక్కా సునీల్, బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నామన పరామర్శ

అమలాపురం రూరల్, మే 15: పి.గన్నవరం మండలం ఉడిమూడి చింతావారిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిలకలపూడి సురేష్‌ను జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆదిమూలం సూర్య, తిరుమనాథం కిరణ్ తదితరులు ఉన్నారు.

కాటన్ జయంతి వేడుకలు


కాటన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అభిమానులు

కడియం, మే 15: కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత సత్తి భాస్కర రెడ్డి (కందరెడ్డి) ఆధ్వర్యంలో బుధవారం సర్ ఆర్థర్ కాటన్ 221వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కందరెడ్డి తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన నిలువెత్తు కాటన్ విగ్రహం వద్ద ప్రతీ ఏటా కాటన్ జయంతి వేడుకలను ఓ ఉత్సవంలా నిర్వహిస్తుంటారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం కాటన్ విగ్రహానికి ధాన్యం, క్షీరం, గోదావరి నదీజలాలతో అభిషేకించి పట్టు వస్త్రాలను సమర్పించారు. గ్రామంలో రైతులను ఆహ్వానించి తేనేటి విందు ఇచ్చారు. కందరెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ ఇంజనీర్‌గా మన దేశానికి వచ్చిన కాటన్ దొర కాటన్ బ్యారేజీ నిర్మించడంతో రైతుల పాలిట ఆపద్బాంధవునిగా మారారన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో అపర భగీరథునిగా నిలిచిన కాటన్ మహాశయునికి జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దూడల నాగేశ్వరరావు, చిట్టూరి అమ్మిరాజు, గుర్రపు సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, తోకల శ్రీనివాసరావు, కాయల సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

వైసీపీ అహంకారం అంతం

జూన్ 4న వేడుకలకు సిద్ధంకండి

జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

గొల్లప్రోలు, మే 15: ప్రజాతీర్పుతో వైసీపీ అహంకారం అంతమవుతుందని, జూన్ 4న వేడుకలకు సిద్ధం కావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిలుపునిచ్చారు. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ ఫంక్షన్‌హాలులో బుధవారం జరిగిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలింగ్‌బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేస్తారని ప్రకటించిన నాటి నుంచి ఈవీఎంలో ఆఖరి ఓటు పడే వరకూ అలుపెరగకుండా పనిచేసిన, శ్రమించిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలకు ఆయన అభినందనలు తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అందరూ బలంగా నిలబడ్డారని, ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఎవరూ కులమతాలు గురించి మాట్లాడవద్దని, పవన్‌కల్యాణ్‌కు కులమే లేదని తెలిపారు. జనసైనికులకు ఆవేశం ఉండవచ్చని, అనవసర ఆవేశం వద్దని చెప్పారు. తప్పు ఎక్కడయినా జరిగితే నిలదీయాలని సూచించారు. కార్మికుల కష్టానికి చిహ్నమైన ఎర్ర తువ్వాలు తొలగించాలని పలు చోట్ల వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేశారని విమర్శించారు. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంగా గీతను మర్యాదగా పలకరించాలని, ఆడపడుచుగా గౌరవించాలన్నారు. అంతే తప్ప ఎగతాళి చేయవద్దని తెలిపారు. అది జనసేన సిద్ధాంతం కాదన్నారు. ఆమె ప్రస్తుతం చెడువైపు నిలబడిందని చెప్పారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు బి.మహేందరరెడ్డి, వేములపాటి అజయకుమార్, మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ పంచకర్ల సందీప్, తుమ్మలపల్లి రమేష్, అనిశెట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా పిఠాపురంలో ఎన్ఆర్ఐ అనిశెట్టి స్వామి ఆధ్వర్యంలో యూఎస్ఏ ఎన్ఆర్ఐ జనసైనికులు అందించిన సేవలు అభినందనీయమని నాగబాబు పేర్కొన్నారు. పిఠాపురంలో ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పోలింగ్ ముగిసేవరకూ వారు అందించిన సేవలను ప్రశంసించారు.

మటన్ కూర వండలేదని మనస్తాపం

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొవ్వూరు, మే 15 : తాను చెప్పినా మటన్ కూర వండలేదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణంలోని 2వ వార్డుకు చెందిన బిశెట్టి వీర్రాజు(38) కార్పెంటర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య కృష్ణవేణిని మటన్ కూర వండమన్నాడు. వండకపోవడంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకున్నాడు. తలుపులు కొట్టినా తీయకపోవడంతో భార్య, కుమార్తెను తీసుకుని పక్కనే ఉన్న అమ్మగారింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు తెరచి, భర్త చీరతో ఉరి వేసుకుని మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీర్రాజు తల్లి చక్ర సత్యవతి అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'తిరుమల' ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్, మే 15: ఏపీఆర్జేసీ పరీక్షా ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు తిరుమల విద్యా సంస్థల విద్యార్థులు సత్తాచాటారు. తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపీసీలో 1వ ర్యాంక్, 2వ ర్యాంక్, బైపీసీలో 2వ ర్యాంక్ తో పాటు టాప్ టెన్‌లో ఎనిమిది ర్యాంక్‌లు సాధించి అత్యుత్తమ ఫలితాలను అందించారని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను జె.యశ్వంత్ సాయి, స్టేట్ సెకండ్ ర్యాంక్‌ను ఎమ్.మారుతి సత్యశ్రీకర్, స్టేట్ 5వ ర్యాంక్‌ను పీవీఎన్ సూర్య ధావన్, స్టేట్ 6వ ర్యాంక్‌ను ఎమ్‌కేస్ సాకేత్, స్టేట్ 8వ ర్యాంక్‌ను డి.శ్రీవేద్, స్టేట్ 10వ ర్యాంక్‌ను సీహెచ్ త్రివేణి కైవసం చేసుకున్నారని తెలిపారు. పదిలోపు 8 మంది, 50లోపు 26 మంది, 100లోపు 46 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

అమలాపురానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ మృతి





దేవరపల్లి, మే 15: ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ తోకల శ్రీహరి (56) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. విశాఖపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 6గంటలకు విజయవాడ బయల్దేరగా దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఉదయం 11.40 నిమిషాలకు ఎదురుగా వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సూరయ్యపేటకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ తోకల శ్రీహరికి తీవ్ర గాయాలవడంతో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీహరి అన్నయ్య తోకల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

బ్లేడ్ బ్యాచ్ యువకులకు రెండేళ్ల జైలు


రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): దారిదోపిడీ కేసులో ముగ్గురు బ్లేడ్ బ్యాచ్ వ్యక్తులకు కోర్టు జైలు శిక్ష విధించింది. సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2022 అక్టోబరు 11న రాత్రి 9గంటల ప్రాంతంలో ధవళేశ్వరం కంచరలైన్ మెయిన్ రోడ్‌లో 15ఏళ్ల బాలుడు ఎలక్ట్రికల్ మోటార్ సైకిల్‌పై బస్టాండ్ వద్దకు వెళ్లాడు. ఆ బాలుడిని ధవళేశ్వరానికి చెందిన అప్పల బత్తుల కృష్ణ వంశీ (దొంగోడు), కూరపాటి సతీశ్ (చేతబడి), ఉమ్మాడి సాయి గణేశ్(సాయి) అడ్డగించారు. బ్లేడు చూపించి భయపెట్టి ప్రభుత్వాస్పత్రి వద్దకు తీసుకెళ్లి ఆటోలో ఎక్కించి చితక్కొట్టారు. దీంతో ఆ బాలుడి శరీరంపై గాయాలయ్యాయి. బలవంతంగా బాలుడి చేతికి ఉన్న వాచీ, రూ.100 లాక్కొని, విషయం బయటకు చెబితే బ్యారేజీ పైనుంచి గోదావరిలో పడేస్తామని బెదిరించారు. బాలుడు ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తాత పట్నాల జువ్వలుకు చెప్పాడు. ఆయన ఫిర్యాదుతో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముగ్గురు ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా అదనపు సెషన్సు న్యాయమూర్తి డి.విజయ్ గౌతమ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్దిరెడ్డి శంభూప్రసాద్, దర్యాప్తు అధికారి అయిన అప్పటి సీఐ కె.మంగాదేవి, విచారణ ప్రక్రియను పర్యవేక్షించిన డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, సీఐ వి.వినయ్ మోహన్, కోర్టు ఏఎస్ఐ జి.వెంకటేశ్వర్లును ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎనిమిది కాసుల బంగారం చోరీ

చెరకు రసంలో మత్తుమందు కలిపి ఆభరణాలు చోరీ చేసిన మహిళ

అనపర్తి, మే 15 : అనపర్తిలో బుధవారం గుర్తు తెలియని మహిళ ఒక వృద్ధురాలికి మాయ మాటలు చెప్పి చెరుకు రసంలో మత్తుమందు కలిపి ఎనిమిది కాసుల బంగారు ఆభరణాలతో పరారైంది. ఎస్ఐ రామారావు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం అనపర్తిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఎదురుగా గల ఇంటిలో సత్యం సత్యవేణి అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటోంది. భర్త చనిపోవడం ఇద్దరు కుమార్తెలు కుమారుడు దూరంగా ఉండటంతో ఆమె ఒంటరిగా జీవిస్తుంది. గత నాలుగు రోజుల నుంచి సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ వృద్ధురాలితో పరిచయం పెంచుకుంది. పనుల్లో సహాయపడుతూ నమ్మకం సంపాదించింది. బుధవారం ఆమె చిన్న కుమార్తె తల్లిని చూసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న మహిళను మీరెవరు అని ప్రశ్నించగా తనకు సత్యవేణి బాగా తెలుసునని నమ్మించింది. కుమార్తె వెళ్లగానే తనతో ప్లాస్టిక్ బాటిల్‌లో తెచ్చిన చెరుకు రసం వృద్ధురాలికి ఇచ్చింది. దీంతో వృద్ధురాలు మత్తులోకి వెళ్లగా బంగారు గొలుసు, ఉంగరాలు తీసుకుని అక్కడి నుండి ఉడాయించింది. స్పృహలోకి వచ్చిన తర్వాత వృద్ధురాలు జరిగిన విషయాన్ని కుమార్తెకు వివరించింది. అనంతరం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పరిసరాల్లోని సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఏపీఆర్జేసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



మామిడికుదురు, మే 15: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురుకు చెందిన లిఖితపూడి హరిసత్యరామ్మోహన్ ఏపీ ఆర్జేసీ 2024 ప్రవేశ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. మంగళవారం రాత్రి ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు ప్రకటించారు. ఎంఈసీ విభాగంలో 150 మార్కులకు 140మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడని విద్యార్థి తండ్రి రమేష్ తెలిపారు. రామ్మోహన్ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే లక్ష్యమన్నారు. పదో తరగతిలో రామ్మోహన్ 580మార్కులు సాధించాడు.

ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

పొల్లూరులో పుష్ప-2 చిత్రీకరణ



సెట్టింగ్‌లు వేస్తున్న దృశ్యం

మోతుగూడెం,మే 15: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామం శివాలయం ప్రాంతంలో పుష్ప-2 చిత్రీకరణ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. యూనిట్ సభ్యులు షూటింగ్ అవసరమైన సామగ్రి ఇక్కడకు తరలిస్తున్నారు. సంత ప్రదేశంలో ఎస్టీడీ బూత్, కిల్లీషాపు, కూరగాయల షాపులు పాకలు ఏర్పాటు చేశారు. ధర్మోకోల్‌తో తయారు చేసిన ఎర్రచందనం దుంగలు, వాహనాలు తీసుకెళ్తున్నారు. సంత నిర్వహణ సన్నివేశాలు చిత్రీకరించారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం

● మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



రాజమహేంద్రవరం సిటీ, మే15 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ నిరంకుశ పాలన పట్ల విసుగుచెందిన ప్రజలు కూటమి అభ్యర్థులకే ఓట్లువేశారన్న సంగతి చాలా స్పష్టంగా అర్థమైందన్నారు. కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవడం, తమ నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన తన కుమారుడు ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎంపీగా పోటీచేసిన దగ్గుబాటి పురందేశ్వరిల విజయం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశాయన్నారు. రాజమహేంద్రవరం టీడీపీకి కంచుకోట అని 50 వేల మెజార్టీతో విజయం సాధించబోతున్నామన్నారు. జూన్ 4న వైసీపీకి ఓటమి ఎంత దారుణంగా ఉంటుందో ప్రజలు చూపించబోతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు మరొకసారి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పల్నాడు జిల్లాలో టీడీపీ నాయకులపై వైసీపీ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓటమి తప్పదని వైసీపీ తట్టుకోలేక పైశాచిక దాడులకు దిగుతుందన్నారు. వెంటనే రాష్ట్రంలోని పోలీస్‌శాఖ స్పందించి దాడులు చేసే వైసీపీ గుండాలను అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్



రాజమహేంద్రవరం సిటీ, మే15 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు తథ్యమని గ్రహించిన వైసీపీ ఓటమి భయంతో రాష్ట్రాన్ని రావణ కాష్టంగా చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమా ర్ అన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లాలో పలుచోట్ల టీడీపీ నేతలపై వైసీపీ నాయకులు దాడులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. టీడీపీ నాయకులపై దాడులుచేస్తున్న వైసీపీ గుండాలను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

పారితోషికంలో వ్యత్యాసాలు సవరించాలి

● ఏపీఎన్‌జీవో సంఘం

రాజమహేంద్రవరం సిటీ, మే 15: జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు జిల్లా అధికారులు, ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహిచడంతో ప్రశాంతంగా జరిగాయని ఏపీఎన్‌జీవో సంఘం రాజమహేంద్రవరం బ్రాంచ్ తెలిపింది. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కె.మాధవీలత దృష్టికి ఏపీఎన్‌జీవో సంఘం అభినందనలు తెలిపింది. ప్రధానంగా జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించిన పారితోషికం చాలా తక్కువ మొత్తం చెల్లించారని సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాకినాడ జిల్లాలో దిగువస్థాయి సిబ్బందికి 1050 రూపాయలు, ఎగువస్థాయిలో రెండువేల యాభై రూపాయలు చెల్లించారని అదే తూర్పుగోదావరిలో మాత్రం అన్యాయంగా క్రింది స్థాయిలో ఏడువందల యాభై, ఎగువస్థాయిలో రూ.1400 చొప్పున చెల్లించారని తక్షణమే సిబ్బంది అందరికీ ఒకే విధంగా పారితోషికం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నన్నయ్య యూనివర్శిటీ రిసెప్షన్‌లో కనీస సౌకర్యాలు లేవన్నారు. రిసెప్షన్ సెంటర్‌కు ఆలస్యంగా చేరుకున్న సిబ్బందికి భోజనాలు లేవన్నారు. అక్కడ మహిళా ఉద్యోగులకు కనీసం టాయిలెట్స్ ఫెసిలిటీ కల్పించాలేదని, ఉద్యోగులు ఇళ్లకు చేరడానికి తగిన ట్రాన్స్‌పోర్టు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారని తెలిపారు. కలెక్టరేట్‌లో పరిపాలన అధికారి రామారావుకు ఏపీఎన్‌జీవో సంఘం బ్రాంచ్ అధ్యక్షుడు వైవీఎస్ నాయుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు మీసాల మాధవరావు, రాష్ట్ర కౌన్సిలర్ సత్యమూర్తి తదితరులు కలిసి వినతిపత్రం అందించారు.

పతంజలి శాస్త్రికి ఘన సత్కారం



పతంజలి శాస్త్రిని సత్కరిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు, కర్రి రామారెడ్డి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 15: పర్యావరణం, అభివృద్ధి పరస్పర పోషకాలని ప్రముఖ కథా రచయిత, పర్యావరణ వేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత తలావఝ్ఝల పతంజలి శాస్త్రి స్పష్టం చేశారు. జీవారణం, పర్యావరణమే మానవజాతి సంస్కృతికి మూలమన్నారు. సాహిత్య అకాడమీ పురస్కారం స్వీకరించి, 80లో అడుగు పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని పతంజలి శాస్త్రిని బుధవారం ఉదయం ప్రకాష్‌నగర్‌లోని ధర్మంచర ఉండవల్లి బుక్ బ్యాంకులో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మిత్రబృంద ం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉండవల్లి మాట్లాడుతూ పతంజలిశాస్త్రి వ్యక్తిత్వం ప్రత్యేకమని, మర్చిపోలేనిదని అన్నారు. పతంజలి శాస్త్రికి రోటరీ సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు రోటరీక్లబ్ ప్రతినిధి పట్టపగలు వెంకట్రావు ప్రకటించారు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ కర్రి రామారెడ్డి, ఓఎన్జీసీ విజయ్ కుమార్, ఆర్ఎస్ వెంకటేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు వీఎస్ ఎస్ కృష్ణకుమార్, ఎన్ఎస్ఎస్ చేంద్రశేఖర్, అశోక్‌కుమార్ జైన్, రిటైర్డ్ ఆర్డీవో జితేంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల సర్వీసులకు
కొవ్వూరు డిపోకు రూ. లక్షా 75వేల ఆదాయం

కొవ్వూరు, మే 15 : సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ప్రత్యేక ఆర్టీసీ సర్వీసుల ద్వారా కొవ్వూరు డిపోకు రూ. లక్షా 75 వేలు ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ వై.వి.వి.ఎస్. కుమార్ తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకుని కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన ఇతర ప్రాంతాలలో ఉంటున్న ఓటర్ల సౌకర్యార్థం నెల 9,11,12 తేదీలలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చేందుకు 4 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, అదేవిధంగా పోలింగ్ అనంతరం తిరుగు ప్రయాణానికి సంబంధించి 13,14,15 తేదీలలో 5 సర్వీసులు హైదారాబాద్ పంపించామన్నారు. దీని ద్వారా డిపోకు రూ.75 వేలు, విజయవాడకు నడిపిన 9 పల్లెవెలుగు సర్వీసుల ద్వారా రూ.లక్ష ఆదాయం వచ్చిందన్నారు.

టీడీపీ గెలుపు ఖాయం: ముప్పిడి

చాగల్లు, మే 15 : ప్రస్తుతం జరిగిన సాధారణ ఎన్నికలలో పోలింగ్ సరళిని బట్టి తెలుగుదేశంపార్టీ భారీ విజయం సాధించబోతుందని టీడీపీ కొవ్వూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం చాగల్లు వచ్చిన ఆయన మాట్లాడుతే అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంను గద్దె దించాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని కోరుకొంటూ ఓటర్లు ఓటు వేశారని ఆయన అన్నారు.

19 నుంచి తాడేలమ్మతల్లి తీర్థ మహోత్సవం ప్రారంభం

దివాన్‌చెరువు, మే 15: భక్తులపాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం శ్రీశ్రీశ్రీ తాడేలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం ఈనెల 19 నుంచి ప్రారంభమై ఐదురోజుల పాటు జరుగుతాయని పాలచర్ల తాడేలమ్మ అమ్మవారి ఆలయ కమిటీసభ్యులు బుధవారం తెలిపారు. ఈ ఉత్సవాలలో మొదటి రోజైన ఆదివారం అమ్మవారి ఆల యంవద్ద గరగ నృత్యాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పులతోపాటు వినోద కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలలో ఐదో రోజైన గురువారం ఆలయంవద్ద అన్నసంతర్పణ జరుగుతుందని తెలిపారు. భక్తులు విచ్చేసి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.



కడియపులంకలో సర్‌ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నర్సరీ అసోసియేషన్



మామిడిని ఆవిష్కరిస్తున్న నర్సరీ రైతులు



అనపర్తి: రామవరంలో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణారెడ్డి

డెల్టా రూపశిల్పి కాటన్ మహాశయుడు

కడియం, మే 15: డెల్టా రూపశిల్పి కాటన్ మహాశయుడు అని రైతులు, నర్సరీ రైతులు పేర్కొన్నారు. కాటన్ 221వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం జిల్లాలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు.

● కడియపులంక - సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీపార్మర్స్ అసోసియేషన్ కార్యాలయ ప్రాంగణంవద్ద పాలకవర్గ సభ్యులు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు ఆధ్వర్యంలో కాటన్ 221వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సరీరైతులు, నర్సరీసంఘం పాలకవర్గ సభ్యులు, పుల్లా ఆంజనేయులు, పాటంశెట్టి చినమహాలక్ష్మినాయుడు, మార్గాని సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, తిరుమలశెట్టి సూర్యభాస్కరావు, తాడాల చక్రవర్తి, బొర్సు వెంకట్రాయుడు, పుల్లా పెదసత్యనారాయణ, తాడాల రవి, గాద నాగేశ్వరరావు, ఘట్టా కృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, జంగా సుబ్బారావు, గరగ నాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్, డైరెక్టర్లు పిల్లా శ్రీనివాసు, గాజుల రత్తయ్య, రావిపాటి రామకృష్ణ, కొండేపూడి నాగు, వడ్డమూడి రాజేష్, ముద్రగడ జమీ, కొత్తపల్లి నాగశివాజీ, ఆకుల గోపాలకృష్ణ, చెక్కపల్లి పోలరాజు, తాళం నరేష్, పెమ్మనబోయిన వీర్రాజు, ఆకుల వెంకన్న, వరగోగుల రుద్రయ్య, పాటంశెట్టి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

●కడియం - బ్రాహ్మణరేవు వద్ద ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం వద్ద కాటన్ జయంతి సందర్భంగా కాటన్ విగ్రహానికి రైతులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు, డాక్టర్ దేవవరపు నీలకంఠరావు, చిక్కాల శ్రీనివాసరావు, దొడ్డా బుజ్జి, బండారు భాస్కరరావు, కోలా సురేష్, పొన్నా ప్రసాద్, ఉండమట్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● మురమండ - బస్టాండ్ సమీపంలో ఉన్నకాటన్ విగ్రహం వద్ద కాటన్ 221వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి వెంకటరామయ్యచౌదరి, పోతుల కృష్ణయ్య, గుణ్ణం కృష్ణమూర్తి, దొంతంశెట్టి శివయ్య, శీని బాస్కరావు, కాకి వెంకటరమణ, యార్లగడ్డ దాసు, కొత్తపల్లి నారాయణస్వామి పాల్గొన్నారు.

మోక్షగుండం మామిడి..

కడియపుసావరం గ్రామానికి చెందిన సప్తగిరి నర్సరీ అధినేత కుప్పాల దుర్గారావు తన నర్సరీలో సరికొత్త మామిడి అభివృద్ధి చేశారు. థాయిలాండ్ నుంచి తీసుకువచ్చి దానికి అంట్లు కట్టి ఫలాలు కాయించారు. కాటన్ జయంతి సందర్భంగా సత్యదేవా నర్సరీ రైతు, నర్సరీసంఘం మాజీ అధ్యక్షుడు పుల్లా అబ్బులు ఈ మొక్కకు మోక్షగుండం మామిడిగా నామకరణం చేశారు. పలు నీటి ప్రాజెక్టుల అభివృద్ధిచేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరును ఈ మొక్కకు పెట్టారు.

అపర భగీరథుడు కాటన్ దొర

ధవళేశ్వరం, మే15: గోదావరిపై ఆనకట్ట కట్టి నీటిని బీడు భూములు మళ్ళించిన కాటన్ దొర అపర భగీరథుడని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

● కాటన్ జయంతి వేడుకల్లో పలు సంఘాల నాయకులు



పసలపూడి లాకుల వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విజయ్‌కుమార్

కొనియాడారు. బుధవారం ఉదయం కాటన్ స్మృతి వనంలో కాటన్ దొర విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

డెల్టా రూపశిల్పి కాటన్ దొర

గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి నీటిని కాల్వల ద్వారా మళ్లించి బీడుభూములకు నీరు అందించి సస్యశ్యామలం చేసినన డెల్టా రూపశిల్పి కాటన్ దొర నీటి పారుదల శాఖ ఇంజనీర్‌లు ఘనంగా నివాళులర్పించి ఆయన జయంతిని నిర్మించారు. బ్యారేజ్ ముఖ ద్వారం వద్ద ఉన్న కాటన్ దొర విగ్రహానికి డెల్టా సీఈ ఆర్. సతీష్‌కుమార్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్ వర్క్స్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, తూర్పుడెల్టా ఈఈ రామకృష్ణ, డీఈ రమేష్ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు కాటన్‌ను ఆదర్శంగా తీసుకుని పనిచే యాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంజనీర్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన కాటన్

● ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి రామకృష్ణారెడ్డి

అనపర్తి: గోదావరినదిపై ఆనకట్టను నిర్మించి గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్ చిరస్మరణీయు డని ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నా రు. బుధవారం కాటన్ జయంతి సందర్భంగా అనపర్తి మండలం రామవరంలోని కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలు వృథాగా పోవడాన్ని గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే ందుకు ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించి అపర భగీరథుడిగా నిలిచారని అన్నారు. గోదావరి ప్రజల గుండెల్లో కాటన్ దొర దైవంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, సత్య గొలుగూరి వీర్రాఘవరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు, మే 15 : ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి ధాన్యాగారంగా తీర్చిదిద్దిన సర్ ఆర్థర్ కాటన్ భావితరాలకు ఆదర్శప్రాయులని రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్ కొనియాడారు. రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరు పట్టణంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక హెవ్‌లాక్ వంతెన (పాత రైలు వంతెన) వద్ద ఉన్న ఆర్థర్ కాటన్ విగ్రహానికి రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ఎల్ఐసీ సెంటర్ కాటన్ విగ్రహంవద్ద జయంతి వేడులను నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలలో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేశారన్నారు. కార్యక్రమంలో పాకా శ్రీనివాస్, తుమ్మలపల్లి నాగరమేష్, నాళం శ్రీనివాస్, కొత్త ప్రసాద్, మద్దుల వీర సోమరాజు, వంకాయల శివరామకృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలు: గోదావరి జిల్లాల వాసుల ఆరాధ్య దైవం సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కె.నందిశ్వరుడు అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని నీటిపారుదలశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ఆయన జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కె.నందీ శ్వరుడు మాట్లాడుతూ కాటన్ మహాశయుడు పరాయి దేశస్థుడైనప్పటికీ గోదావరి నదిపై ఆనకట్టలు నిర్మించి గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాలను అన్నపూర్ణగా మార్చిన మహనీయుడని అన్నారు. నేటికీ అందరి హృదయాలలో కాటన్ మహాశయుడు సజీవంగా నిలిచే ఉన్నారన్నారు. కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, బి.కిషోర్, కె.శ్రీనివాస్, ఎమ్.శ్రీనివాస్, కె.రామసత్యనారాయణ, నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా బుధవారం పలు గ్రామాల్లో నిర్వహించారు. కాటన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పసలపూడి లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి నీటి పారుదలశాఖ లాక్ సూపరింటెండెంట్ ముప్పిడి విజయకుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కాల్ధరి, వేలివెన్ను, పసలపూడి,ఉండ్రాజవరం, చిలకపాడు గ్రామాల్లో కాటన్ విగ్రహాలకు రైతులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొవ్వూరు హెవ్‌లాక్ వంతెన వద్ద కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ నాయకులు



నిడదవోలులో నీటిపారుదల శాఖ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఉద్యోగులు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన
సమాజంలోని అందరి బాధ్యత

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్ బాబు

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లలకు మంచి విద్య అందించి స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. కార్మిక తదితర శాఖలతో కలిసి ఆయన బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేయడానికి ప్రత్యేక బృందాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. నివేదికను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6-14 ఏళ్ల పిల్లలను కార్మికులుగా /పనివాళ్లుగా మార్చడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఉచిత నిర్బంధ విద్య పొందడం రాజ్యాంగం పిల్లలకు కల్పించిన హక్కు అని ఆయన తెలిపారు. పిల్లల భద్రత, భవిష్యత్తు దృష్ట్యా మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఈవో కె.వాసుదేవ రావు, ఎంఈవో బి.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): అల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలోని వెల్లంకివారి వీధి ఎదురుగా ఉన్న రోడ్డుపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా ప్రదేశానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి సుమారు 45ఏళ్లు ఉంటా యని, ఎరుపురంగు టీషర్టు ధరించి ఉన్నాడని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానికంగా వాకబు చేసినా ఫలితం లేదన్నారు. అతడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గైట్‌లో 17 నుంచి
ఎస్టీయూ రాష్ట్రస్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు



సమావేశంలో పాల్గొన్న ఎస్టీయూ సంఘ నాయకులు

రాజానగరం, మే 15 : రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు)రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు ఈనెల 17,18 తేదీల్లో రాజానగరం సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సంఘ నాయకులతో కలిసి బుధవారం గైట్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శివ ప్ర సాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ఈ తరగతులకు సుమారు. 200 మంది ఉపాధ్యాయులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఈశిక్షణా తరగతులకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.రఘునాధరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు హాజరుకాకున్నారని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సైతం అధిక సంఖ్యలో సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు హాజరై శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో తూర్పుగోదావరి, కాకినాడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దానియేల్‌బాబు, లక్ష్మణ్, దొరబాబు, పళ్లంరాజు, కాశీవిశ్వనాధ్, సంఘ రాష్ట్ర నాయకులు రాంబాబు, త్రినాధ్‌బాబు, సామ్యూల్‌సన్, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యర్థుల ఎత్తులు ఫలించేనా

●గెలుపుపై ఎవరి ధీమా వారిదే

దివాన్‌చెరువు/రాజానగరం మే 15: ఇటీవల జరిగిన శాసనసభా ఎన్నికలలో రాజానగరం నియోజకవర్గం జనసేన. టీడీపీ, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ పోటీ చేశారు. ఇదే పేరునగల ఇతర జిల్లాలకు చెందిన మరో ఇద్దరు అభ్యర్థులు అసెంబ్లీకి, ఒక అభ్యర్థి లోక్‌సభకు పోటీ చేశారు. కూటమి అభ్యర్థి బత్తులకు కేటాయించిన ఎన్నికల గుర్తు గాజుగ్లాసును పోలిన గుర్తులే మిగిలిన ఇద్దరు అభ్యర్థులకు కేటాయించడం, ఈ ముగ్గురు అభ్యర్థుల పేర్లు ఈవీఎంలలో వరుస క్రమంలో ఉండడంతో కొంత మంది ఓటర్లు అయోమయానికి గురైనట్లు తెలుస్తోంది. ఓటర్లు చైతన్యవంతులై ఓటుహక్కు వినియోగించుకుంటున్న ప్రస్తుత తరుణంలో ప్రత్యర్థులు వేసే ఇటువంటి ఎత్తులు చిత్తుకావడం ఖాయమని కూటమి వారు అంటున్నారు. జూన్ నాల్గవ తేదీన వెలువడే ఎన్నికల ఫలితాలు తమ అభ్యర్థికే విజయం చేకూరు తుందన్న గట్టి విశ్వాసంతో ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ ముగిసి ఓటరు తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. ఓటింగ్ జరిగిన తీరు చూస్తే ఓటర్లు స్పష్టతతో తీర్పు ఇచ్చారని తెలుస్తోంది. ఓటింగ్ లో జిల్లాలోనే రాజానగరం నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచింది. చాలాగ్రామాలలో ఓటర్లు ఎండవేడిమిని సైతం లెక్క చేయకుండా గంటల తరబడి క్యూలైన్లులో వేచి ఉండడం, పోలింగ్‌సమయం సాయంత్రం 6 గంటలు దాటినా బాగా పొద్దుపోయే వరకూ ఓపికతో వేచిఉండి ఓట్లు వేశారు. నియోజకవర్గంలో 2,16.491 మంది ఓటర్లుకుగాను 87.53 శాతం అనగా1,89,505 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తాము చాలా ఎన్నికలలో పనిచేశామని ఈవిధంగా ఓటర్లు ఓట్లు వేయడం అరుదుగా చెప్పవచ్చునని పలువురు విశ్లేషకులు అంటున్నారు. ఇక గెలుపుపై ఎవరికి వారే ధీమాగా ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ముందునుంచే రాత్రింబవళ్లు ప్రజలను కలుసుకొని వారి ఆశీర్వాదం అందుకు నేందుకు ప్రయత్నించిన అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఓట్ల లెక్కింపు కోసం ఎదురు చూస్తున్నారు. నాయకులు,కార్యకర్తలతో గెలుపు అవకాశాలపై చర్చలు సాగిస్తున్నారు.

పాతవెలుగుబందలో మళ్లీ పాత సమస్యే

● రాత్రి 12 గంటల దాకా సాగిన పోలింగ్ ప్రక్రియ

● ఓటర్ల ఇబ్బందులు పట్టని వైనం

రాజానగరం, మే 15 : సార్వత్రిక ఎన్నికల్లో ఆ గ్రామంలో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ప్రతిసారి ఇబ్బందులు తప్పడం లేదు. నిర్ధిత సమయానికే ఓటర్లంతా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నా ఓటు వేయడానికి మాత్రం గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సిందే. ఎన్నికల సమయంలో ప్రతిసారి ఇబ్బందులు బారిన పడుతున్నా అధికారులు మాత్రం పోలింగ్ కేంద్రం ఏర్పాటులో పునరాలోచించడం లేదని మండలంలోని పాతవెలుగుబంద గ్రామస్థులు వాపోతున్నారు. నియోజకవర్గంలోని 216 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ సాయంత్రం సమయానికి పూర్తవుతున్నా, అర్ధరాత్రి దాకా పోలింగ్ సాగడం ఇక్కడ పరిపాటిగా మారింది. గ్రామంలోని పాఠశాల భవనంలో 167 పోలింగ్ కేంద్రంలో 1240 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రం అనువుగా లేకపోవడం ఒక కారణమైతే, ఇరుకుగా ఉండే సందు మార్గం గుండా ఓటర్ల వెళ్లిరావాల్సి ఉండటం మరో కారణంగా చెప్పొచ్చు. గత ఎన్నికల్లో కూడా ఇక్కడ ఇదే సమస్య ఉత్పన్నమైంది. దీంతో పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ల తరలింపు సెక్టార్ మొత్తం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల సమయంలో ఈపాఠశాల భవనంలో పోలింగ్ కేంద్రం కేటాయించవద్దని చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఇదే ప్రాంగణంలో మరో భవనంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు అధిగమించవచ్చని వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు భావిస్తున్నారు.


సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యామినీ	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
సూర్యాప్యాలస్	ప్రతినిధి -2
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్లీ వచ్చింది
అనుశ్రీ(సాయికృష్ణ)	లక్ష్మీకటాక్షం
రాజా	రత్నం
ఊర్వశి	బాక్
రంభ	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
మేనక	ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
కుమారి	రత్నం
వీఎస్ మహల్(నామవరం)	కృష్ణమ్మ, ప్రతినిధి-2
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	కృష్ణమ్మ
వెంకటసూర్య(కడియం)	ఆ ఒక్కటీ అడక్కు
సత్యగౌరి (అనపర్తి)	బాక్
సూర్యశ్రీ (అనపర్తి)	ఆ ఒక్కటీ అడక్కు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	బాక్
రామకృష్ణ(కోరుకొండ)	
గీతాసినిమాస్ (సీతానగరం)	
శ్రీనివాస (గోకవరం)	కృష్ణమ్మ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్
లలితామహల్(రంపచోడవరం)	ఆ ఒక్కటీ అడక్కు
నవయుగ(చింతూరు)	ఆ ఒక్కటీ అడక్కు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 16 మే 2024 | 5



▸ ఫలితాలపై పందాల జోరు ▸ టీడీపీ గెలుపుపై 1కి 3 లేదా 5 రెట్లు
▸ వైసీపీపై పందెం కట్టేవాళ్లు కరువు ▸ పోలింగ్ ముందుకాసిన బెట్ సెటిల్

ఊరూరా.. బెట్టింగ్ బంగార్రాజులే



గోపాలపురంలో బెట్టింగులో డబ్బులు కలుపుతున్న యువకుడు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ఫలితాలపై జిల్లాలో పందాలు జోరందుకున్నాయి. ఎవరి అంచనాల మేరకు వాళ్లు కట్టల కొద్దీ డబ్బును బెట్టింగ్‌లో పెడుతున్నారు. గతంకంటే ఈ ఎన్నికల్లో పందాల జోరు హుషారుగా సాగుతోంది. విదేశాల్లో ఉన్నవాళ్లు సైతం ఏపీ ఎన్నికల ఫలితాలపై దృష్టి పెట్టారు. లక్షలాది రూపాయలను తమ వారికి పంపించి పందెం కాయిస్తున్నారు. తతంగం అంతా ఫోన్లలో జరిగిపోతుండగా.. జామీనుగా కాగితాలను రాసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లోనూ బెట్టింగులు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాష్ట్రం మొత్తంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే పందాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెబుతున్నారు. వాస్తవానికి సంక్రాంతి సమయంలో కోడి పందాలకు ఈ జిల్లా పెట్టింది పేరుకావడంతో అదే అలవాటుగా ఎన్నికల బరుల్లో నిలిచిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యాలపై డబ్బుపెడుతున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులపై, పార్టీ గెలుపు, మెజారిటీలపై పందాలు కాస్తున్నారు.

● పిఠాపురంపైనే చూపు

జనసేనానికి పవన్‌కల్యాణ్ బరిలో ఉన్న పిఠాపురంపై బెట్టింగులు భారీసంఖ్యలో జరుగుతున్నాయి. ఎన్ఆర్ఐలు కూడా పందాలు కాస్తున్నారు. సాధారణంగా గెలుపుఓటములపై పందాలు కాస్తారు. కానీ పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్ మెజారిటీపై ఎక్కువగా బెట్టింగ్ కడుతుండడం విశేషం. కచ్చితంగా పవన్ 30వేలపైనే ఆధిక్యం సాధిస్తారని డబ్బులు పెడుతున్నారు. ఈ నియోజకవర్గంలో పోలింగ్ శాతం కూడా గణనీయంగా పెరగడంతో ఆ మేరకు అంచనాలు పెరిగిపోయాయి. పవన్‌కల్యాణ్ గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తూ తెలంగాణ నుంచి కూడా ఇక్కడి వారితో పెద్దఎత్తున బెట్టింగ్‌లు కడుతున్నారు. తర్వాత రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గంపై పందాలు జోరుగా సాగుతున్నాయి. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కూడా కూటమి గెలుపుపై పెద్దఎత్తున బెట్టింగ్‌లకు చాలామంది సవాళ్లు విసురుతున్నారు.

● కూటమిపై కోసు పందెం

కూటమిపై కోసు పందాలు వేస్తున్నారు. రాష్ట్రంలో కచ్చితంగా కూటమి అధికారంలోకి వస్తుందంటూ లక్షలాది రూపాయలు పందెంలో పెడుతున్నారు. కూటమి గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తూ కోసు పందెం కాస్తున్నారు. అంటే 1కి 3 రెట్లు లేదా అయిదురెట్లు ఎక్కువగా ఇస్తామంటూ పందెంలోకి దిగుతున్నారు. కొన్నిచోట్ల డబ్బుతో పాటు వాహనాలు, స్థలాలను కూడా బెట్టింగ్‌లో పెడుతున్నట్టు సమాచారం. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగువాళ్లు జిల్లాలోని వారి బంధువులకు ఫోన్‌చేసి కూటమి గెలుపుపై పందాలు కాస్తున్నారు. సాధారణంగా యువత, సులభంగా డబ్బు సంపాదించాలనుకునే వాళ్లు పందాలపై ఎక్కువగా దృష్టి పెడుతుంటారు. అయితే ఈ ఎన్నికల్లో మాత్రం ఉద్యోగులు, వ్యాపారస్తులు సైతం పెద్ద మొత్తంలో బెట్టింగ్ కడుతున్నారు. ఎన్నికల పోలింగ్ భారీగా జరగడంతో అంచనాలు కూడా అదే స్థాయిలో చేస్తూ ఈ పందాల జోరు కూడా అదే స్థాయిలో పెరిగింది.

● పోలింగ్ తర్వాత మారిన సీన్

ఎన్నికల్లో అభ్యర్థులను ప్రకటించిన నాటి నుంచీ బెట్టింగులు మొదలయ్యాయి. అభ్యర్థి, అక్కడి వాతావరణం ఆధారంగా పందాల్లోకి దిగారు. తొలుత కూటమి, వైసీపీల గెలుపులపై పోటాపోటీగా డబ్బులు పెట్టారు. కానీ పోలింగ్ తర్వాత సీన్ మారిపోయింది. టీడీపీ గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తూ పందానికి డబ్బులు పట్టుకుని తిరుగుతున్నా వైసీపీ తరఫున కాసేవారు కరువయ్యారు. పోలింగ్ అయిన తర్వాత అప్పటివరకూ వైసీపీ తరఫున పందాలు కట్టినవాళ్లు కొంత మొత్తాన్ని వదులుకొని సెటిల్ చేసుకుంటున్నారు. రాజానగరం మండలం తూర్పుగోనగూడెంలో ఇద్దరు వ్యక్తుల నడుమ బుధవారం రూ.10 లక్షల పందానికి రాతలు జరిగాయి. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో టీడీపీ గెలిచి తీరుతుందంటూ ఓ వ్యక్తి రూ.5 లక్షలకు పందెం కట్టాడు. ఇలా లక్షల రూపాయలను బెట్టింగ్‌ల్లో పెడుతున్నారు. అయితే అధిక శాతం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపు ఖాయమంటూ పందాలకు సవాల్ విసురుతున్నారు. పందాలు కాస్తున్న వారిలో మధ్యతరగతి వారి నుంచి ధనవంతులు కూడా ఉంటున్నారు. ఏదో సరదాకి కాకుండా చాలా సీరియస్‌గా పందాల తంతు సాగుతోంది. జూదం కిందకు వచ్చే పందాలు చట్టరీత్యా నేరం. అయితే ఎవరికి వారు గుట్టుగా పందాలు పట్టుకోవడంతో వ్యక్తుల పేర్లు బయటకు పొక్కడం లేదు. ఫోన్లు, ఆన్‌లైన్‌ల ద్వారా కూడా బెట్టింగ్ దందాలు కొనసాగుతున్నాయి. దీంతో పోలీసులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో భారీ సంఖ్యలో బెట్టింగ్‌లు జరుగుతున్నా ఒక్క ఫిర్యాదు కూడా పోలీసులకు అందకపోవడం గమనార్హం. కనీసం దీనిపై నిఘా పెట్టినట్టు కూడా కనిపించడం లేదు.

● కౌంటింగ్ ఎంతోదూరం.. ఎంతమంది చిక్కుకుంటారో..

గోపాలపురం, మే 15: పోలింగ్ ముగియడంతో ఫలితాలపై పందాలు జోరందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తెల్లారిలేచింది మొదలు ఎక్కడ చూసినా పందాల చర్చలే. రాష్ట్రంలో టీడీపీ గెలుస్తుందని, వైసీపీ గెలుస్తుందని పందాలు నడుస్తున్నాయి. కౌంటింగ్ వ్యవధి ఎక్కువగా ఉండడంతో పందాలకు ఎందరు చిక్కుకుంటారోనని పలువురు ఆవేదన చెందుతున్నారు.

కూటమిలో జోష్

విజయం కూటమివైపు అంటూ ప్రచారం

ఉద్యోగవర్గాల్లోనూ ఇదే చర్చ

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు నుంచి జోష్‌లో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో ఎన్నికల తర్వాత మరింత జోష్ పెరిగింది. వారితోపాటు ప్రజల్లోనూ ఆసక్తికర చర్చ జరుగుతోంది. సైలెంట్ వేవ్ ఉందని, అందుకే పోలింగ్‌కు కసితో జనం వచ్చినట్టు వేశారనే అంచనాకు ఇంచుమించు అన్ని వర్గాలు వచ్చాయి. ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతతోనూ ఈ వేవ్ వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. టీడీపీ కూడమిలో అందరూ గెలుపు ధీమాతో ఉన్నారు. మెజార్టీలు అంచనా వేసుకుంటున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపు అవకాశాలకు కూటమి బలం, ప్రభుత్వంపై వ్యతిరేక ఓట్లు చీలకపోవడం, అభ్యర్థులతో పాటు కూటమి నేతలు, శ్రేణులు కలసి పనిచేయడం వల్ల మంచి ఫలితాలు రానున్నట్టు అంచనా వేస్తున్నారు. అటు వైసీపీ అభ్యర్థులు రకరకాల వ్యూహాలతో ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించిన నేతలు కూడా డీలాపడ్డారు. సీఎం జగన్ వైఖరిని లక్ష్యంగా చేసుకుని ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేయడానికి రావడంతో వైసీపీలో ఓట్ల కోసం కష్టపడ్డ వారి ప్రయత్నాలన్నీ వృథా అయినట్టు ప్రచారం జరుగుతోంది. అయినా ఎవరి ధీమాతో వారు ఉన్నారు. ఇక ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్గాలు, అధికారుల్లో కూటమి వచ్చేస్తుందనే చర్చ జరుగుతోంది. కానీ అవినీతికి ఆస్కారం ఉన్న, అధికార పార్టీ తప్పులకు తలొగ్గిన అధికారుల్లో భయం మొదలైంది. కూటమి అధికారంలోకి వస్తే, అవినీతిపై విచారణలు ఉంటాయని, తప్పు చేయకపోయినా, మౌనంగా ఉండడం, అడ్డుకోకపోవడం వంటి కారణాలతో ఇరుక్కోవలసి వస్తుందనే భయం పట్టుకుంది. మొత్తం మీద ప్రభుత్వ విధానాలు నచ్చక ప్రతిపక్ష పార్టీలకంటే ముందు ఉద్యోగులే నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా విజయవాడ వీధుల్లోకి వచ్చి కదంతొక్కిన సంగతి తెలిసిందే. తర్వాత అందరిలోనూ ధైర్యం వచ్చింది. తెలుగుదేశం చంద్రబాబు పోరాటం, లోకేశ్ పాదయాత్ర, పవన్ వారాహి యాత్ర వంటివి ప్రజల్లో ఒక నమ్మకాన్ని కలిగించినట్టు పరిశీలకులు భావిస్తున్నారు. తర్వాత టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడడం, రాజమహేంద్రవరంతోపాటు పలుచోట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రచారం చేయడం కూడా కూటమికి కలసి వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి జోష్ మీద ఉంది.

వీళ్లింతేనా?

▸ సిటీలో ఓటు వేయని ఆ 33 శాతం మంది ఏమయ్యారు
▸ ఎప్పటి మాదిరిగానే ఆఖరున ఓటుకు వచ్చి వెనుదిరిగిన జనం
▸ మరోవైపు మందకొడిగా ఈవీఎంల పనితీరు
▸ క్యూలో నిలుచోలేక కొందరు, సొంత పనుల కోసం మరికొందరు ఓటుకు దూరం

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న గొప్పతనం అమూల్యమైనది. పాలకులను ఎన్నుకొనే మహత్తర సమయం. ఐదేళ్లకు ఒకసారి వచ్చే అద్భుత అవకాశం. కానీ కొందరు ఓటర్లకు ఓటు విలువ ఈనాటికీ తెలియడం లేదు. వేలుపై ఇంకు పడడం పల్లె జనం ఒక హోదాగా భావిస్తుంటే నాగరికతకు నిదర్శనాలం, ఆధునికతకు దర్పణాలం అని చెప్పుకొనే సిటీ ఓటర్లు మాత్రం వెనుకబడిపోతున్నారు. వాస్తవానికి పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించినా బద్ధకం పోవడం లేదు. గ్రామాల్లో మాత్రం ఒక రోజు కూలీ పోయినా ప్రజాస్వామ్యాన్ని బతికించాలనే తపన కనబడింది. రవాణా తదితర ఇబ్బందులను అధిగమించి మరీ పోలింగ్ బూత్‌లకు వచ్చారు. పట్టణాలు, నగరాల్లో మాత్రం ఓటు వేయడానికి కాసేపు క్యూలో నిలబడలేక, కొంత సమయమైనా కేటాయించలేని దుస్థితి మనది.

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి.. శాతాల్లో..			
నియోజకవర్గం	2014	2019	2024
రాజమండ్రి సిటీ	69.47	66.19	66.72
రాజ. రూరల్	73.97	74.21	72.99
కొవ్వూరు	85.28	86.46	85.69
నిడదవోలు	85.72	82.70	80.31
గోపాలపురం	86.96	85.92	85.10
అనపర్తి	85.98	87.44	83.78
రాజానగరం	85.93	87.83	86.16
జిల్లా మొత్తం	81.90	81.53	80.93



రాజమహేంద్రవరంలో సోమవారం క్యూలైన్లలో తక్కువగా కనిపించిన ఓటర్లు (ఫైల్ ఫొటో)

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పోలింగ్ సరళిని గమనిస్తే ఈసారి గ్రామాలు ఉన్న నియోజకవర్గాల్లో ఓటర్లు హుషారెత్తించారు. నగరాల్లో జనం మాత్రం సొంత పనులకు పరిమితమయ్యారు. ప్రజాస్వామ్యాన్ని బతికించుకొనేరోజు ఐదేళ్లకు ఒకసారి మాత్రమే ఓటరు చేతివరకూ వస్తుంది. ఆ రోజు దాటిందంటే సువర్ణావకాశం చేజేతులా జారవిడుచుకున్నట్టే. ఆ విషయాన్ని కూడా సిటీ ప్రజలు ఇంకా ఆకళింపు చేసుకున్నట్టు కనబడడం లేదు. సోమవారం జరిగిన పోలింగ్‌లో సిటీ జనం చాలా మటుకు ఓపిగ్గా క్యూలో నిలబడి ఓటువేసినా.. వేలాది మంది ఇళ్లకే పరిమితమయ్యారు. ఒకవేళ పోలింగ్ స్టేషను వరకూ వచ్చినా లైనులో నిలబడలేక వెనుదిరిగారు. కొందరు ఇళ్ల వద్ద నుంచే పోలింగ్ స్టేషన్ల వద్ద పరిస్థితి తెలుసుకొని ఆగిపోయారు. పండు టాకులు, మంచం పట్టిన వారు సైతం ఉద్యమంలా వచ్చి ఓటు వేసినా అన్ని అవయవాలు సవ్యంగా పని చేస్తున్న వేలాది మందిలో మాత్రం ఆ బాధ్యత కరువైంది. కొన్ని దేశాల్లో ఓటు వేయకపోతే జరిమానా విధించడం అమల్లో ఉంది. భారత్‌లో కూడా ఆ విధానం వస్తేగానీ కనువిప్పు కలగదనే వాదన పలువురి నుంచి వినవస్తోంది.

● సిటీ నియోజకవర్గంలో చివరాఖరున వచ్చి..

రాజమండ్రి లోక్‌సభా స్థానంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలైన రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురంలలో 2014లో 81.90 శాతం, 2019లో 81.53 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. ఈసారి 80.93 శాతం మాత్రమే నమోదైంది. ఓటువేయని సుమారు 20 శాతం మంది ఇళ్లకు, సొంత పనులకు పరిమితమయ్యారు. ఇక జిల్లాలోని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో అత్యల్పంగా 66.72 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. అంటే సుమారు 33 శాతం మంది ఓటర్లు పోలింగ్ స్టేషన్లకు రాలేదు. 3 శాతం మంది ఆస్పత్రుల్లో ఇతర అత్యవసర పనుల వల్ల రాలేకపోయినా ఏకంగా 30 శాతం మంది ఓటింగ్‌కి దూరంగా ఉండడం గర్హనీయమని ప్రజాస్వామ్యవాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు దఫాల ఎన్నికల్లో కూడా ఏడు నియోజకవర్గాలకు సంబంధించి రాజమహేంద్రవరం సిటీలో అత్యంత తక్కువగా ఓటింగ్ నమోదైంది. దీంతో నగర ఓటర్లలో ఏ స్థాయిలో నిరాసక్తత ఉందో తెలుస్తోంది.

● మందకొడిగా ఈవీఎంల పనితీరు

ఓటర్లు ఉద్యమంలా తరలివచ్చినా ఈవీఎంలు మొరాయించడం, మందకొడిగా పోలింగ్ సాగడం, కనీసం కూర్చోవడానికి కూడా సరిపడా కుర్చీలు లేకపోవడం ఓటర్లకు చిర్రెత్తించింది. ఓవైపు ఎండ, మరోవైపు సదుపాయాల కొరతతో అల్లాడిపోయారు. ఓ దశలో భారీ క్యూలైన్లు ఎటు నుంచి ఎటు వెళ్లాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. హెల్ప్ డెస్క్ కూడా చేతులెత్తేయక తప్పలేదు. చాలాచోట్ల అప్పటికప్పుడు టెంట్లను రప్పించి సరిపెట్టారు. పోలింగ్ స్టేషనులోకి వచ్చిన ఓటరుకు బూత్ నంబరు చెప్పడానికి కూడా తగు సిబ్బంది లేరు. దీంతో వృద్ధులు, పసివాళ్లతో వచ్చిన మహిళలు తీవ్రంగా అసహనం వ్యక్తంచేశారు. మహిళలకు చాలాచోట్ల ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటుచేయలేదు. ఇక దివ్యాంగుల పరిస్థితి మరీ దారుణంగా కనిపించింది. వారిని వీల్‌చైర్‌లో బూత్ లోపలికి తీసుకెళ్లే సహాయకులూ తగు సంఖ్యలో లేరు. మధ్యాహ్నం నుంచి ఉన్న కొద్దిపాటిమంది కూడా కనుమరుగయ్యారు. దీంతో ఆటో డ్రైవర్లు, తమ కూడా వచ్చిన వారి సహాయంతో దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల పాట్లు మరీ ఎక్కువగా కనిపించాయి. మెడికల్ డెస్కులు పెట్టినా జనాలకు ఉపయోగపడలేదు. వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసే ప్రయత్నం కూడా చేయలేదు. కొన్నిచోట్ల ఈవీఎంల మొరాయింపుతో సమయం వృథా అయ్యింది. ఒక్కో ఓటు తీసుకోవడానికి ఈవీఎంకి సగటున 3 నుంచి 5 నిమిషాల సమయం పట్టడంతో జనం ఎక్కువసేపు క్యూలైన్లలో మగ్గిపోక తప్పలేదు. ఈ ప్రభావం కూడా ఓటింగ్ శాతంపై పడింది. మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటింగ్ శాతం పడిపోయింది. జిల్లాలో 3,09,594 మంది ఓటర్లు పోలింగ్‌కి దూరంగా ఉండగా.. గత ఏడాది కంటే 0.60శాతం దిగువకు పడిపోయి 80.93 శాతం నమోదైంది. రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో అత్యధికంగా 86,751 మంది ఓటేయలేదు. నగర ఓటర్లు సహజంగానే విద్యావంతులు అధికంగా ఉంటారు. ఓటుపై స్పృహ ఉన్నప్పటికీ ఓటేయకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

కాటన్‌దొర సేవలు ఎనలేనివి



ధవళేశ్వరంలో కాటన్‌కు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పురందేశ్వరి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ధవళేశ్వరం, మే 15: ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేయడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో సాగునీటి కట్టడాలు నిర్మించి ప్రజలకు సాగు, తాగు నీరు అందించిన కాటన్‌దొర సేవలు ఎనలేనివని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. బుధవారం ఉదయం బ్యారేజ్ సెంటర్ వద్ద ఉన్న కాటన్ దొర విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 144 సెక్షన్ అమలు : కలెక్టర్



జిల్లా కలెక్టర్ మాధవీలత

దివాన్‌చెరువు,మే15: భారత ఎన్నికల సంఘం జారీచేసిన నోటిఫికేషన్ మేరకు పోలింగ్ ప్రక్రియ తర్వాత ఈవీఎంలు, వీవీప్యాట్‌లను వెలుగుబందలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామని, 24 గంటలూ భద్రతా బలగాలు కాపలా కాస్తున్నాయని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపు పూర్తయ్యేవరకూ 144 సెక్షన్ అమల్లోకి తెచ్చామని, ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు తప్ప ఒక కి.మీలోపు ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు చట్టవిరుద్ధంగా సమావేశమవ్వడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకూ స్ట్రాంగ్‌రూమ్‌ల పరిధిలో ఒక కిలో మీటరు మేర ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ ఉత్తర్వుల ఉల్లంఘన జరిగితే భారతీయ శిక్షాస్మృతి 1860లోని సెక్షన్ 188 ప్రకారం కఠినంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వచ్చాయని కలెక్టర్ తెలియజేశారు.

ఓట్ల లెక్కింపు ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండాలి : ఐజీ

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ముగిసే వరకూ మరింత అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా ఏర్పాటుచేసిన బందోబస్తుపై ఆయన సమీక్ష చేశారు. జిల్లాలో కొనసాగుతున్న భద్రతా చర్యల గురించి ఐజీకి ఎస్పీ జగదీశ్ వివరించారు. జగన్నాథపురం, గోపాలపురం చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. హింసాత్మక సంఘటనలకు పాల్పడినా, కవ్వింపు చర్యలకు దిగినా, సాధారణ జన జీవనానికి విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఐజీ హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసులను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. గోపాలపురం నియోజకవర్గంలోని బందోబస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్షించి పలు సూచనలు చేశారు.



స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు సమీక్షిస్తున్న ఎస్పీ జగదీశ్

జిల్లాలో 144 సెక్షన్ అమలు : ఎస్పీ

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకూ జిల్లాలో సెక్షన్ 144 అమలులో ఉంటుందని ఎస్పీ జగదీశ్ స్పష్టం చేశారు. నలుగురు అంతకుమించి గుంపులుగా ఉండకూడదన్నారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ప్రచారాలు నిర్వహించడం నేరమన్నారు. అన్ని ప్రాంతాలపై ప్రతిక్షణం నిఘా ఉందని.. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ జగదీశ్ బుధవారం పరిశీలించారు. కెమెరాల పనితీరు, బందోబస్తు, రూమ్ చుట్టూ కంచె తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధులు నిర్వర్తిస్తున్న కేంద్ర, రాష్ట్ర బలగాలకు పలు సూచనలు చేశారు. నిరంతరం అప్రమత్తతో ఉండాలని ఆదేశించారు.

కాటన్ భావితరాలకు ఆదర్శనీయుడు | మటన్ కూర వండలేదని ఆత్మహత్య | పారితోషికంలో వ్యత్యాసాలు సవరించాలి - 8లో

ఎన్నికల సర్వీసులకు

కొవ్వూరు డిపోకు రూ. లక్షా 75వేల ఆదాయం

కొవ్వూరు, మే 15 : సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ప్రత్యేక ఆర్టీసీ సర్వీసుల ద్వారా కొవ్వూరు డిపోకు రూ. లక్షా 75 వేలు ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ వై.వి.వి.ఎస్. కుమార్ తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకుని కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన ఇతర ప్రాంతాలలో ఉంటున్న ఓటర్ల సౌకర్యార్థం నెల 9,11,12 తేదీలలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చేందుకు 4 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, అదేవిధంగా పోలింగ్ అనంతరం తిరుగు ప్రయాణానికి సంబంధించి 13,14,15 తేదీలలో 5 సర్వీసులు హైదారాబాద్ పంపించామన్నారు. దీని ద్వారా డిపోకు రూ.75 వేలు, విజయవాడకు నడిపిన 9 పల్లెవెలుగు సర్వీసుల ద్వారా రూ.లక్ష ఆదాయం వచ్చిందన్నారు.

టీడీపీ గెలుపు ఖాయం: ముప్పిడి

చాగల్లు, మే 15 : ప్రస్తుతం జరిగిన సాధారణ ఎన్నికలలో పోలింగ్ సరళిని బట్టి తెలుగుదేశంపార్టీ భారీ విజయం సాధించబోతుందని టీడీపీ కొవ్వూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం చాగల్లు వచ్చిన ఆయన మాట్లాడుతే అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వంను గద్దె దించాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని కోరుకొంటూ ఓటర్లు ఓటు వేశారని ఆయన అన్నారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజల ఆశలకు అనుగుణంగా పాలన సాగిస్తుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఓటు వేసిన వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యం శక్తి ఎటువంటిదో ఓటర్లు ఓటు హక్కుతో తెలియజేశారని అన్నారు. ఆయనతో టీడీపీ నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, కేతా సాహెబ్, కొఠారు అశోక్‌బాబా, కరుటూరి సతీష్ పాల్గొన్నారు.

లక్ష్మీ నారాయణస్వామికి విశేష పూజలు



నిడదవోలు, మే 15: నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో వేంచేసివున్న శ్రీ లక్ష్మీ నారాయణ స్వామికి బుధవా రం విశేష పూజలు నిర్వహించారు.

శనివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం

ఈనెల 19న శనివారం వైశాఖ శుద్ధ ఏకాదశమి సందర్భంగా స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని భక్తులంతా పాల్గొనాల్సిందిగా ఆలయ అర్చకులు కోరారు.

పాస్టర్స్ నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ కోసం ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ తిమోతి

నల్లజర్ల, మే 15: నల్లజర్ల యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు డి.శ్యాంబాబు తెలిపారు. బుధవారం అచ్చన్నపాలెం ఈసీఎఫ్ చర్చిలో అసోషియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా పి.రాజ్‌కుమార్(కవులూరు)కార్యదర్శి ఎస్.సురేష్ (మారెళ్ళమూడి)కోశాధికారి కే.రాజు(జగన్నాధపురం)గౌరవాధ్యక్షుడు ఎం.ప్రసాద్(అనంతపల్లి), జె.ఆశీర్వాదం(అచ్చన్నపాలెం), ఉపాధ్యక్షు డు ఎం.ఇశ్రాయేలు రాజు(తెలికిచర్ల), ఉప కార్యదర్శి పి.యేసురాజు(తెలికిచర్ల), నలుగురి సలహాదారులను, 5గురు సభ్యులను కమిటీలో ఎన్నుకున్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు



నిడదవోలులో రోటరీ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసిన రోటరీ ప్రతినిధులు

నిడదవోలు, మే 15: రోటరీక్లబ్ దాతల సహకారంతో పట్టణ మండల గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం సిమెంటు బెంచీలను ఏర్పాటు చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేట, గాంధీనగర్, విద్యానగర్, బస్టాండ్, మండలంలోని డి.ముప్పవరం తదితర ప్రాంతాలలో దాతల సహకారంతో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కీర్తి ఆంజనేయు లు మాట్లాడుతూ సుమారు రూ.1.50 లక్షలతో 40 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశామని త్వరలో మరిన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యం, అడ్డాల సత్య ప్రభాకర్, గుంటుపల్లి శివకుమార్, బొజ్జా పాపారావు పాల్గొన్నారు.

మటన్ కూర వండలేదని..

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు ఐశెట్టి వీర్రాజు

కొవ్వూరు, మే 15: ఇంట్లో ఉరి వేసుకుని ఒక వ్యక్తి ఆత్మహ త్య చేసుకున్న సంఘటన కొవ్వూరు పట్టణంలో చోటుచేసు కుంది. ఈ సంఘటనకు సంబంధించి కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జి.జి.ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణంలోని 2వ వార్డుకు చెందిన ఐశెట్టి వీర్రాజు(38) కార్పెంటర్ పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14న మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య కృష్ణవేణిని మటన్ కూర వండమన్నాడు. వండకపోవడంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని పడుకున్నాడు. తలుపులు కొట్టినా తీయకపోవడంతో భార్య, కుమార్తెను తీసుకుని ప్రక్కనే ఉన్న అమ్మగారింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం వచ్చి చూసేసరికి తలుపులు తెరచి, భర్త చీరతో ఉరి వేసుకుని మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తల్లి చక్ర సత్యవతి అందించిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

వృద్ధురాలికి

మాయ మాటలు చెప్పి బంగారం చోరీ

● చెరుకు రసంలో మత్తుమందు కలిపి ఆభరణాలు అపహరించిన మహిళ



వృద్ధురాలు సత్యవేణి

అనపర్తి, మే 15: అనపర్తిలో బుధవారం గుర్తు తెలియని మహిళ ఒక వృద్ధురాలికి మాయమాటలు చెప్పి చెరుకు రసంలో మత్తు మందు కలిపి ఆమె వద్ద నున్న ఎనిమిది కాసుల బంగారు ఆభర ణాలతో పరా రైంది. ఎస్ఐ రామారావు, బాధితురాలు తెలిపిన వివ రాల ప్రకారం అనపర్తిలోని మండల పరిషత్ కార్యా లయం సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఎదురుగా గల ఇంటిలో సత్యం సత్యవేణి అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటుంది. భర్త చనిపోవ డం ఇద్దరు కుమార్తెలు కుమారుడు దూరంగా ఉండటంతో ఆమె ఒంటరిగా జీవిస్తోంది. గత నాలుగు రోజుల నుంచి సుమారు 30సం వత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని మహిళ వృద్ధు రాలితో పరిచయం పెంచుకుంది. ఇంట్లోకి వెళ్లి వృద్ధురాలికి సహాయపడుతూ ఉండటంతో ఆమె పట్ల వృద్ధురాలికి నమ్మకం ఏర్పడింది. బుధవారం ఆమె చిన్న కుమార్తె తల్లిని చూసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న మహిళలను మీరెవరు అని ప్రశ్నించగా మీ అమ్మగారు నాకు బాగా తెలుసునని నమ్మించింది. ఆమె తిరిగి వెళ్లగానే తనతో ప్లాస్టిక్ బాటిల్‌లో తెచ్చిన చెరుకు రసం వృద్ధురాలికి ఇచ్చింది. వృద్ధురాలు చెరుకు రసం తాగి మత్తులోకి జారుకుంది. ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, ఉంగరాలు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించింది. వృద్ధురాలికి మత్తు తీరడంతో జరిగింది తెలుసుకుని కుమార్తెకు ఫోన్‌లో విషయం తెలపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పరిసరాల్లోని సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆభరణాల విలువ సుమారు 1.60 లక్షల విలువ ఉంటుందని ఎస్ఐ రామారావు తెలిపారు.

19 నుంచి తాడేలమ్మతల్లి తీర్థ మహోత్సవం ప్రారంభం

దివాన్‌చెరువు, మే 15: భక్తులపాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం శ్రీశ్రీశ్రీ తాడేలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం ఈనెల 19 నుంచి ప్రారంభమై ఐదురోజుల పాటు జరుగుతాయని పాలచర్ల తాడేలమ్మ అమ్మవారి ఆలయ కమిటీసభ్యులు బుధవారం తెలిపారు. ఈ ఉత్సవాలలో మొదటి రోజైన ఆదివారం అమ్మవారి ఆల యంవద్ద గరగ నృత్యాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పులతోపాటు వినోద కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలలో ఐదో రోజైన గురువారం ఆలయంవద్ద అన్నసంతర్పణ జరుగుతుందని తెలిపారు. భక్తులు విచ్చేసి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.





కొవ్వూరు హెవ్‌లాక్ వంతెన వద్ద, ఎల్ఐసీ సెంటర్‌వద్ద కాటన్‌కు నివాళులు అర్పిస్తున్న రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ నాయకులు



నిడదవోలులో నీటిపారుదల శాఖ కార్యాలయంలో కాటన్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఉద్యోగులు

కాటన్ భావితరాలకు ఆదర్శనీయుడు

కొవ్వూరు, మే 15 : ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి ధాన్యాగారంగా తీర్చిదిద్దిన సర్ ఆర్థర్ కాటన్ భావితరాలకు ఆదర్శప్రాయులని రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్ కొనియాడారు. రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వూరు పట్టణంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలను నిర్వహించారు. స్థానిక హెవ్‌లాక్ వంతెన (పాత రైలు వంతెన) వద్ద ఉన్న ఆర్థర్ కాటన్ విగ్రహానికి రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ఎల్ఐసీ సెంటర్ కాటన్ విగ్రహంవద్ద జయంతి వేడులను నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలలో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేశారన్నారు. కార్యక్రమంలో పాకా శ్రీనివాస్, తుమ్మలపల్లి నాగరమేష్, నాళం శ్రీనివాస్, కొత్త ప్రసాద్, మద్దుల వీర సోమరాజు, వంకాయల శివరామకృష్ణ పాల్గొన్నారు.

నిడదవోలు: గోదావరి జిల్లాల వాసుల ఆరాధ్య దైవం సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కె.నందీశ్వరుడు అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని నీటిపారుదలశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి ఆయన జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కె.నందీ శ్వరుడు మాట్లాడుతూ కాటన్ మహాశయుడు పరాయి దేశస్థుడైనప్పటికీ గోదావరి నదిపై ఆనకట్టలు నిర్మించి గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాలను అన్నపూర్ణగా మార్చిన మహనీయుడని అన్నారు. నేటికీ అందరి హృదయాలలో కాటన్ మహాశయుడు సజీవంగా నిలిచే ఉన్నారన్నారు. కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, బి.కిషోర్, కె.శ్రీనివాస్, ఎమ్.శ్రీనివాస్, కె.రామసత్యనారాయణ, నీటిపారుదల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా బుధవారం పలు గ్రామాల్లో నిర్వహించారు. కాటన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పసలపూడి లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి నీటిపారుదలశాఖ లాక్ సూపరింటెండెంట్ ముప్పిడి విజయకుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కాల్దరి, వేలివెన్ను, పసలపూడి,ఉండ్రాజవరం, చిలకపాడు గ్రామాల్లో కాటన్ విగ్రహాలకు రైతులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డెల్టా రూపశిల్పి కాటన్ మహాశయుడు

కడియం, మే 15: డెల్టా రూపశిల్పి కాటన్ మహాశయుడు అని రైతులు, నర్సరీ రైతులు పేర్కొన్నారు. కాటన్ 221వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం కడియం మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు.

● కాటన్ జయంతి వేడుకల్లో పలు సంఘాల నాయకులు



పసలపూడి లాకుల వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విజయ్‌కుమార్

● కడియపులంక - సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీపార్మర్స్ అసోసియేషన్ కార్యా లయ ప్రాంగణంవద్ద పాలకవర్గ సభ్యులు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు ఆధ్వర్యంలో కాటన్ 221వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సరీరైతులు, నర్సరీసంఘం పాలకవర్గ సభ్యులు, పుల్లా ఆంజనేయులు, పాటంశెట్టి చినమహాలక్ష్మినాయుడు, మార్గాని సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, తిరుమలశెట్టి సూర్యభాస్కరావు, తాడాల చక్రవర్తి, బొర్సు వెంకట్రాయుడు, పుల్లా పెదసత్యనారాయణ, తాడాల రవి, గాద నాగేశ్వరరావు, ఘట్టా కృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, జంగా సుబ్బారావు, గరగ నాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్, డైరెక్టర్లు పిల్లా శ్రీనివాసు, గాజుల రత్తయ్య, రావిపాటి రామకృష్ణ, కొండేపూడి నాగు, వడ్డమూడి రాజేష్, ముద్రగడ జమీ, కొత్తపల్లి నాగశివాజీ, ఆకుల గోపాలకృష్ణ, చెక్కపల్లి పోలరాజు, తాళం నరేష్, పెమ్మనబోయిన వీర్రాజు, ఆకుల వెంకన్న, వరగోగుల రుద్రయ్య, పాటంశెట్టి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

●కడియం - బ్రాహ్మణరేవు వద్ద ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం వద్ద కాటన్ జయంతి సందర్భంగా కాటన్ విగ్రహానికి రైతులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు, డాక్టర్ దేవవరపు నీలకంఠరావు, చిక్కాల శ్రీనివాసరావు, దొడ్డా బుజ్జి, బండారు భాస్కరరావు, కోలా సురేష్, పొన్నా ప్రసాద్, ఉండమట్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● మురమండ - బస్టాండ్ సమీపంలో ఉన్నకాటన్ విగ్రహం వద్ద కాటన్ 221వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి వెంకటరామయ్యచౌదరి, పోతుల కృష్ణయ్య, గుణ్ణం కృష్ణమూర్తి, దొంతంశెట్టి శివయ్య, శీని బాస్కరావు, కాకి వెంకటరమణ, యార్లగడ్డ దాసు, కొత్తపల్లి నారాయణస్వామి పాల్గొన్నారు.

మోక్షగుండం మామిడి..

కడియపుసావరం గ్రామానికి చెందిన సప్తగిరి నర్సరీ అధినేత కుప్పాల దుర్గారావు తన నర్సరీలో సరికొత్త మామిడి అభివృద్ధి చేశారు. థాయిలాండ్ నుంచి తీసుకువచ్చి దానికి అంట్లు కట్టి ఫలాలు కాయించారు. కాటన్ జయంతి సందర్భంగా సత్యదేవా నర్సరీ రైతు, నర్సరీసంఘం మాజీ అధ్యక్షుడు పుల్లా అబ్బులు ఈ మొక్కకు మోక్షగుండం మామిడిగా నామకరణం చేశారు. పలు నీటి ప్రాజెక్టుల అభివృద్ధిచేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరును ఈ మొక్కకు పెట్టారు.

అపర భగీరథుడు కాటన్ దొర

ధవళేశ్వరం, మే15: గోదావరిపై ఆనకట్ట కట్టి నీటిని బీడు భూములు మళ్ళించిన కాటన్ దొర అపర భగీరథుడని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు కొనియాడారు. బుధవారం ఉదయం కాటన్‌స్మృతి వనంలో కాటన్ దొర విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

డెల్టా రూపశిల్పి కాటన్ దొర

గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి నీటిని కాల్వల ద్వారా మళ్లించి బీడుభూములకు నీరు అందించి సస్యశ్యామలం చే సినన డెల్టా రూపశిల్పి కాటన్ దొర నీటి పారుదల శాఖ ఇంజనీర్‌లు ఘనంగా నివాళులర్పించి ఆయన జయంతిని నిర్వించారు. బ్యారేజ్‌ముఖ ద్వారం వద్ద ఉన్న కాటన్ దొర విగ్రహానికి డెల్టా సీఈ ఆర్. సతీష్‌కుమార్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్ వర్క్స్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, తూర్పుడెల్టా ఈఈ రామకృష్ణ, డీఈ రమేష్, తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు కాటన్‌ను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఇంజనీర్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన కాటన్

● ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి రామకృష్ణారెడ్డి

అనపర్తి: గోదావరినదిపై ఆనకట్టను నిర్మించి గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ఆర్థర్ కాటన్ చిరస్మరణీయు డని ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నా రు. బుధవారం కాటన్ జయంతి సందర్భంగా అనపర్తి మండలం రామవరంలోని కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి జలాలు వృధాగా పోవడాన్ని గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే ందుకు ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించి అపర భగీరథుడిగా నిలిచారని అన్నారు. గోదావరి ప్రజల గుండెల్లో కాటన్ దొర దైవంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, సత్య, గొలుగూరి వీర్రాఘవరెడ్డి, నల్లమి ల్లి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కడియపులంకలో సర్ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నర్సరీ అసోసియేషన్



మామిడిని ఆవిష్కరిస్తున్న నర్సరీ రైతులు



అనపర్తి: రామవరంలో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణారెడ్డి

గోపాలపురం పోలీస్‌స్టేషన్ సందర్శించిన ఐజీ



జగన్నాధపురంలో మండల పరిస్థితుల పై పోలీసులను అడిగి తెలుసుకుంటున్న ఐజీ అశోక్‌కుమార్

గోపాలపురం, మే 15: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేప థ్యంలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండల పోలీస్ స్టేషన్‌ను ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ బుధవారం సందర్శించారు. అనంతరం జగన్నాధపురం గ్రామ శివారులో ఉన్న అంతర్ జిల్లాల చెక్ పోస్టును ఆయన పరిశీలించారు. ఆయన మా ట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. అదేవిధంగా సమస్యాత్మక గ్రామాల మధ్య పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్పీ జగదీష్‌కుమార్, సీఐ బాలసురేష్‌బాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'పారితోషికంలో వ్యత్యాసాలు సవరించాలి'

రాజమహేంద్రవరం సిటీ, మే 15: జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు జిల్లా అధికారులు, ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించడంతో ప్రశాంతంగా జరిగాయని ఏపీఎన్‌జీవో సంఘం రాజమహేంద్రవరం బ్రాంచ్ తెలిపింది. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కె.మాధవీలత దృష్టికి ఏపీఎన్‌జీవో సంఘం అభినందనలు తెలిపింది. ప్రధానంగా జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించిన పారితోషికం చాలా తక్కువ మొత్తం చెల్లించారని సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాకినాడ జిల్లాలో దిగువస్థాయి సిబ్బందికి 1050 రూపాయలు, ఎగువస్థాయిలో రెండువేల యాభై రూపాయలు చెల్లించారని అదే తూర్పుగోదావరిలో మాత్రం అన్యాయంగా క్రింది స్థాయిలో ఏడువందల యాభై, ఎగువస్థాయిలో రూ.1400 చొప్పున చెల్లించారని తక్షణమే సిబ్బంది అందరికీ ఒకే విధంగా పారితోషికం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నన్నయ్య యూనివర్సిటీ రిసెప్షన్‌లో కనీస సౌకర్యాలు లేవన్నారు. రిసెప్షన్ సెంటర్‌కు ఆలస్యంగా చేరుకున్న సిబ్బందికి భోజనాలు లేవన్నారు. అక్కడ మహిళా ఉద్యోగులకు కనీసం టాయిలెట్స్ ఫెసిలిటీ కల్పించాలేదని, ఉద్యోగులు ఇళ్లకు చేరడానికి తగిన ట్రాన్స్‌పోర్టు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారని తెలిపారు. కలెక్టరేట్‌లో పరిపాలన అధికారి రామారావుకు ఏపీఎన్‌జీవో సంఘం బ్రాంచ్ అధ్యక్షుడు వైపీఎస్ నాయుడు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం : మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మే15 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తున్నారని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ నిరంకుశ పాలన పట్ల విసుగుచెందిన ప్రజలు కూటమి అభ్యర్థులకే ఓట్లువేశారన్న సంగతి చాలా స్పష్టంగా అర్థమైందన్నారు. కూటమి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవడం, తమ నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● బస్సు డ్రైవర్ మృతి

దేవరపల్లి, మే 15: ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ తోకల శ్రీహరి (56) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. విశాఖపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 6గంటలకు విజయవాడ బయల్దేరగా దేవరపల్లి డైమండ్ జంక్షన్‌వద్ద 11.40 నిమిషాలకు ఇక్కడికి రాగా ఎదురుగా వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ఆర్‌టీసీ బస్సు ఢీ కొనడంతో బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సూరయ్యపేటకు చెందిన ఆర్‌టీసీ డ్రైవర్ తోకల శ్రీహరికి తీవ్ర గాయాలవడంతో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీహరి అన్నయ్య తోకల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. ఆర్‌టీసీలో ప్రయాణిస్తున్న ప్రయాణికు లేవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.





లారీని ఢీకొని నుజ్జునుజ్జైన ఆర్టీసీ అమరావతి ఎక్స్‌ప్రెస్ బస్సు ముందుభాగం, ఆర్టీసీ డ్రైవర్ తోకల శ్రీహరి మృతదేహం

మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

దేవరపల్లి, మే 15: ధాన్యంరాశి గుట్టను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన దేవరపల్లి మండ లం సూర్యనారాయణపురం జాతీయ సర్వీసురోడ్డులో ప్రమా దం చోటు చేసుకుంది. దేవరపల్లి ప్రైవేటు పాఠశాల లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామా నికి ముళ్ళపూడి రామకృష్ణ (50) ధాన్యం రాశిపై బరకం కప్పు తుండగా బుధవారం సాయంత్రం 7గంటలకు మోటార్ సైకిల్ ఢీకొని ప్రమాదవశాత్తూ పడిపోవడంతో తలకు తీవ్రమైన గా యం కావడంతో గోపాలపురం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పోలీసులు, కుటుంబ సభ్యు లు తెలిపారు. దేవరపల్లిలో స్కూల్ బస్సును రిపేర్ చేయించుకుని తిరిగి మోటర్ సైకిల్‌పై స్వగ్రామం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు ఇద్దరుకి వివాహం అయ్యింది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): అల్కాట్ గార్డెన్స్ ప్రాంతంలోని వెల్లంకివారి వీధి ఎదురుగా ఉన్న రోడ్డుపై మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా ప్రదేశానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి సుమారు 45ఏళ్లు ఉంటా యని, ఎరుపురంగు టీషర్టు ధరించి ఉన్నాడని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానికంగా వాకబు చేసినా ఫలితం లేదన్నారు. అతడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన

సమాజంలోని అందరి బాధ్యత

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లలకు మంచి విద్య అందించి స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. కార్మిక తదితర శాఖలతో కలిసి ఆయన బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేయడానికి ప్రత్యేక బృందాల ఏర్పాటుకు ఆదేశాలిచ్చారు. నివేదికను డీఎల్ఎస్ఏకి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6-14 ఏళ్ల పిల్లలను కార్మికులుగా/పనివాళ్లుగా మార్చడం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఉచిత నిర్బంధ విద్య పొందడం రాజ్యాంగం పిల్లలకు కల్పించిన హక్కు అని ఆయన తెలిపారు. పిల్లల భద్రత, భవిష్యత్తు దృష్ట్యా మరింత పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఈవో కె.వాసుదేవ రావు, ఎంఈవో బి.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.